
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3



విశాఖపట్నం
జిల్లా వార్తలు
శనివారం 26 ఏప్రిల్ 2025

నేడు ముఖ్యమంత్రి రాక

ఏఎంసీలో సెంటినరీ అలూమ్ని భవనాన్ని ప్రారంభించనున్న చంద్రబాబునాయుడు



- రూ.50 కోట్లతో నిర్మాణం

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం నగరానికి వస్తున్నారు. ఉదయం 10.40 గంటలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వెళ్లి... మత్స్యకార భరోసా నిధులు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి ... మిగతా 4వ పేజీలో



సీఎం ప్రారంభించనున్న ఏఎంసీ సెంటినరీ అలూమ్ని భవనం

శతాబ్ది సంబరాలకు వేళాయె..



విద్యుత్ దీపాల వెలుగులో ఆంధ్ర విశ్వవిద్యాలయం

నేటితో 99 ఏళ్లు పూర్తి చేసుకుని వందో వసంతంలోకి అడుగిడనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం

ఏడాది పాటు ఉత్సవాల నిర్వహణ

- అకడమిక్, అవుట్‌రిచ్, మెగా ఈవెంట్లు
- నేడు పలు కార్యక్రమాలు
- ఉదయం 6 గంటలకు బీచ్‌రోడ్డులో వాక్‌థాన్
- మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్ లో ప్రధాన కార్యక్రమం

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవ శోభను సంతరించుకుంది. 1926 ఏప్రిల్ 26వ తేదీన ఏర్పాటైన విశ్వవిద్యాలయం శనివారంతో 99 ఏళ్లను పూర్తి చేసుకుని, వందో సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ క్రమంలో శనివారం నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 26వ తేదీ వరకు శతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు ఏయూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ శుక్రవారం ఉదయం కోర్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఏడాదిపాటు అకడమిక్, అవుట్‌రిచ్, మెగా ఈవెంట్లు జరపాలన్నారు. మెగా ఈవెంట్లను విభిన్న విభాగాలు సంయుక్తంగా సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులను ఆహ్వానించాలన్నారు. సాధారణ సదస్సులకు భిన్నంగా ఈ మెగా ఈవెంట్లు ఉండాలని వీసీ దిశా నిర్దేశం చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 26న శతాబ్ది ఉత్సవ ముగింపు వేడుకలను ఘనంగా ... మిగతా 4వ పేజీలో

డీఆర్‌సీలో సమస్యల ఏకరువు

టిడ్కో ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యేలు వెలగపూడి, గణబాబు ఆరోపణ

- విచారణకు ఆదేశించిన ఇన్‌చార్జి మంత్రి
- నగరంలో వీధి దీపాల నిర్వహణపై ఎంపీ, ఎమ్మెల్యేల అసంతృప్తి
- ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన ప్లాట్లను 22-ఎలో చేర్చడంపై గాజువాక ఎమ్మెల్యే పల్లా నిలదీత
- నేరేళ్లవలస- తాళ్లవలస మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణంపై ఎమ్మెల్యేల అభ్యంతరం
- 100 గజాలలోపు స్థలంలో ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ విజ్ఞప్తి
- అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు
- విశాఖ నుంచి విజయవాడకు విమాన సర్వీస్‌లు పునరుద్ధరించాలని కోరిన విష్ణుకుమార్‌రాజు



జిల్లా సమీక్షా మండలి సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణశ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అధికారుల అలసత్వం...తదితర అంశాలపై జిల్లా సమీక్షా మండలి సమావేశం శుక్రవారం వాడి,వేడిగా చర్చ జరిగింది. టిడ్కో ఇళ్ల కేటాయింపు, వసతులు లేకుండా లబ్ధిదారులకు అప్పగింత, నగరంలో వీధి దీపాల నిర్వహణ, జీవీఎంసీలో ప్రణాళికా విభాగం పనితీరు, పలు శాఖల అధికారుల ప్రోటోకాల్ ఉల్లంఘన, నేరేళ్లవలస-తాళ్లవలస మాస్టర్‌ప్లాన్ రోడ్డు ప్రతిపాదన...వంటి వాటిపై ఎమ్మెల్యేలు గట్టిగా నిలదీశారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా మండలి సమావేశం జరిగింది. తొలుత గత ఏడాది అక్టోబరు 25న జరిగిన డీఆర్‌సీలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల గురించి చర్చించారు. అనంతరం మంత్రి బాల వీరాంజనేయస్వామి చర్చ ప్రారంభిస్తూ పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమ, విశాఖ తూర్పు ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో టిడ్కో ఇళ్ల నిర్మాణం, కేటాయింపులు, రిజిస్ట్రేషన్‌లలో పలు అవకవతకలు జరిగాయని ఆరోపించారు. టీడీపీ హయాంలో లబ్ధిదారులను ఎంపిక చేసి అలాట్‌మెంట్ పత్రం ఇస్తే, తరువాత వైసీపీ పాలనలో కొందరు వాటిని తారుమారు చేశారన్నారు. మంత్రి స్పందిస్తూ విచారణ చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను ఆదేశించారు. నగరంలో వీధి దీపాల నిర్వహణపై ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి, గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. నగరంలో 22 వాట్స్ కలిగిన వీధి దీపాల వల్ల ప్రయోజనం లేదని, నిర్వహణ ఏమి బాగాలేదని వ్యాఖ్యానించారు. కొత్తగా దీపాలు అమర్చే ముందు తొలుత ఆడిట్ చేయాలని ఎంపీ సూచించగా, చాలాచోట్ల దీపాలు వెలగడంలేదని ఎమ్మెల్యేలు పెదవివిరిచారు. విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీ, ఏపీ ఆయిల్ సీడ్స్ సహకార సంస్థ చైర్మన్ గండి బాబ్జీ మాట్లాడుతూ నగరంలో 100 గజాలలోపు ఇళ్లు నిర్మించుకునే వారికి సెల్ఫ్ సర్టిఫికేషన్ విషయంలో జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. 100 గజాల లోపు ప్లాన్ అవసరం లేదని ప్రభుత్వం వెసులుబాటు కల్పించినా ప్రజలకు అధికారులు ఇబ్బంది పెడుతున్నారన్నారు. గాజువాకలో పట్టణ ప్రణాళికా విభాగాన్ని ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. గెడ్డలు, చెరువుల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులు ... మిగతా 4వ పేజీలో

- ఫిల్మ్ క్లబ్‌కు స్థలం కేటాయింపుపై పునఃపరిశీలించాల్సిందిగా వినతిపత్రం

ఆర్థిక రాజధానిగా విశాఖ

- అందుకు తగిన ప్రమాణాలకు అనుగుణంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు కార్యాచరణ
- దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళికాయుతంగా పనిచేస్తాం



- ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ నగరాల్లో ఒకటైన విశాఖపట్నాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని, ఆర్థిక రాజధాని ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు తగిన కార్యాచరణతో ముందుకువెళ్లాలని అధికారులకు సూచించినట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సమీక్షా మండలి సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన పలు అంశాలపై యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో చర్చించిన అంశాలను అనంతరం విలేకరులకు వివరించారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళికాయుతంగా పనిచేస్తామన్నారు. వేసవిలో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకులను అందుబాటులో ఉంచాలని ఆదేశించామని, శానిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేగంగా పూర్తిచేయాలని సూచించామన్నారు. పలు శాఖలకు సంబంధించి భూములు, ఇతర అంశాలపై పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించామన్నారు. ప్రతి శాఖలో పెండింగ్ కేసులపై ఒక సమావేశం నిర్వహిస్తామన్నారు. సింహాచలం భూముల వివాదంపై ప్రభుత్వం ప్రత్యేకించి దృష్టిసారించిందని మంత్రి వివరించారు.

అసెంబ్లీ సెగ్మెంటంతా ఒకే జోన్‌లోకి...

- డీఆర్‌సీలో కలెక్టర్ ప్రతిపాదన
- అందరి అభిప్రాయం తీసుకుని ప్రభుత్వానికి పంపుతామని వెల్లడి



ఇన్‌చార్జి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఒక అసెంబ్లీ నియోజకవర్గమంతా ఒకే జోన్‌లో ఉండేలా మార్పులు, చేర్పులు చేస్తామని, దీనిపై అందరి అభిప్రాయం తీసుకుని ప్రభుత్వ ఆమోదానికి పంపుతామని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్షా మండలి (డీఆర్‌సీ) సమావేశంలో జీవీఎంసీ జోన్‌లపై కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ పరిధిలో ఒకటి, రెండు అంతకంటే ఎక్కువ జోన్‌లు ఉండడంతో పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నాయని పలువురు ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. భీమిలి అసెంబ్లీ పరిధిలో 1, 2 జోన్‌లతోపాటు మూడో జోన్‌లో కొంత భాగం ఉందన్నారు. గాజువాక తప్ప మిగిలిన నియోజకవర్గాల పరిధిలో ఒకటి, అంతకంటే ఎక్కువ జోన్‌లు ఉన్నాయని అనగా విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక జోన్ ఉంటే పాలనాపరంగా శాసనసభ్యుడు తన పరిధిలో జోన్ కమిషనర్‌తో చర్చించుకుంటారన్నారు. అయితే భీమిలి మొత్తం ఒక జోన్ కాకుండా రెండు జోన్‌లకు పరిమితం చేస్తే తొమ్మిది జోన్‌లు అవసరమవుతాయని అనగా ...కలెక్టర్ స్పందిస్తూ జోన్‌ల సంఖ్య ఎనిమిదికి మించరాదన్నారు. దీనిపై మరోసారి చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పగానే ఎమ్మెల్యేలంతా సమ్మతి తెలిపారు.



చంద్రమౌళి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు

చంద్రమౌళికి కడసారి నివాళి

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరైన మంత్రులు, నాయకులు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటనలో మృతిచెందిన చంద్రమౌళి భౌతిక కాయానికి శుక్రవారం ఉదయం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తిచేశారు. పాండురంగాపురం నుంచి పార్థివ దేహాన్ని ఊరేగింపుగా జ్ఞానాపురం శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ స్వయంగా పాడె మోశారు. అంత్యక్రియలకు ప్రజలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు తరలివచ్చారు. జోహార్ చంద్రమౌళి అని వీడ్కోలు పలికారు. అంతకుముందు చంద్రమౌళి భౌతికకాయం వద్ద హోం మంత్రి వంగలపూడి అనిత, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వైసీపీ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ... మిగతా 4వ పేజీలో



చంద్రమౌళి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

అమ్మో... కశ్మీరా

విమాన, రైళ్ల టికెట్లు రద్దు చేసుకుంటున్న పర్యాటకులు

- డబ్బు తిరిగి ఇచ్చేందుకు హోటళ్ల యాజమాన్యాల నిరాకరణ
- ఏప్రిల్‌లో నగరం నుంచి టికెట్లు బుక్ చేసుకున్నవారు 800 మంది
- మే నెలలో 250 మంది...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



ఉగ్రదాడి జరిగిన పహల్గాం ప్రాంతం

పర్యాటక స్వర్గధామం కశ్మీర్ మళ్లీ వెలవెలబోయే పరిస్థితులు వచ్చాయి. నాలుగైదేళ్లుగా అక్కడకు వెళ్లే పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రతి వేసవిలో రాష్ట్రం నుంచి సుమారు ఐదు వేల మంది వరకూ కశ్మీర్ వెళ్లి వస్తున్నారు. తాజాగా పహల్గాంలో జరిగిన ఘటనతో ఇప్పుడు కశ్మీర్ అంటేనే అంతా భయకంపితులవుతున్నారు.

పహల్గాంలో ఉగ్రవాదులు 28 మంది పర్యాటకులను విచక్షణారహితంగా తుపాకులతో కాల్చి చంపడం, అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారూ ఉండడంతో కశ్మీర్ పర్యటనకు వెళ్లడానికి ఇప్పుడు అంతా వెనకడుగు వేస్తున్నారు. విశాఖపట్నానికి చెందిన పది మంది ఈ నెల 18న కశ్మీర్ పర్యటనకు వెళ్లగా, వారిలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ చంద్రమౌళి ఉగ్రవాదుల చేతితో హతమైన సంగతి తెలిసిందే. ఈ ఘటన తరువాత కశ్మీర్ పర్యటనకు వెళ్లిన వారంతా అర్ధంతరంగా టూర్ ముగించుకొని వెనక్కి వచ్చేశారు. ఈ వేసవి సెలవుల్లో కశ్మీర్ వెళ్లాలని ముందుగానే విమాన, రైలు టికెట్లు, హోటల్ రూమ్‌లు బుక్ చేసుకున్నవారు ఇప్పుడు వాటిని రద్దు చేసుకుంటున్నారు.

విశాఖపట్నం నుంచి కశ్మీర్ వెళ్లడానికి మూడు మార్గాలను పర్యాటకులు ఎంచుకుంటారు. ఎక్కువ మంది విమానాలను ఆశ్రయిస్తారు. విశాఖపట్నం నుంచి ఢిల్లీ, అక్కడి నుంచి శ్రీనగర్‌కు చాలామంది వెళుతున్నారు. వీరికి రానుపోను చార్జీల కింద ట్రావెల్ సంస్థలు రూ.40 వేలు వసూలు చేస్తున్నాయి. మరికొంతమంది విశాఖపట్నం నుంచి విమానంలో ఢిల్లీ వెళ్లిపోయి, అక్కడి నుంచి జమ్మూ వరకు రైలులోను, అక్కడి నుంచి శ్రీనగర్‌కు రహదారి మార్గంలో వెళుతున్నారు. వైష్ణోదేవిని దర్శించుకోవాలనుకునే వారిలో అత్యధికులు ఈ విధంగా వెళుతున్నారు. ఇంకొందరు విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లి అక్కడి నుంచి జమ్మూ-తావి రైలులో ... మిగతా 4వ పేజీలో

నేడు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై అవిశ్వాస తీర్మానం

- నెగ్గుతుందని కూటమి ధీమా..
- సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించిన వైసీపీ

-6లో

జిల్లాలో 4,534 మందికి మత్స్యకార భరోసా...

- నేడు రూ.20 వేల వంతున విడుదల

-6లో

దంపతుల హత్య

- దువ్వాడ ప్రాంతంలో దారుణం
- 24 గంటల తరువాత వెలుగులోకి...




హత్యకు గురైన గంపల యోగీంద్రబాబు, గంపల లక్ష్మి (ఫైల్ ఫొటోలు)

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధ దంపతులు హత్యకు గురయ్యారు. ఇందుకు సంబంధించి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రిటైర్డ్ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగి గంపల యోగీంద్రబాబు (66), ఆయన భార్య లక్ష్మి (52) గత 30 ఏళ్లుగా జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్ నగర్‌లో నివాసముంటున్నారు. ఐదు రోజుల క్రితం ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వెళ్లారు. రెండు రోజుల క్రితం తిరిగి వచ్చారు. శుక్రవారం సాయంత్రం యోగీంద్రబాబు ఇంటికి ఆయన మేనల్లుడు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉంది. ఇరువురికీ ఫోన్ చేస్తే ఇంట్లో రింగ్ అవుతుండడంతో అనుమానం వచ్చి కిటికీ తలుపులు తీసి చూడగా...రక్తపు మడుగులో యోగీంద్రబాబు కనిపించారు. దాంతో వెంటనే 100కి ఫోన్ చేశారు. సీపీ ఆదేశాల మేరకు ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తాళం బద్ధలు కొట్టించారు. లోపలకు వెళ్లి చూస్తే హాల్‌లో యోగీంద్రబాబు, మరో రూమ్‌లో లక్ష్మి రక్తపు మడుగులో పడి మృతిచెంది ఉన్నారు. వారిని ఎవరు హత్య చేశారు, ఎందుకు చేశారన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. బంగారం, నగదు కోసం ... మిగతా 4వ పేజీలో


అధ్వానంగా ఉన్న రహదారి


శిథిలమై కూలిపోయిన పార్కు ప్రహరీ గోడలు


రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణం

సమస్యల 'సాగర'ం

- సాగర్‌నగర్ కాలనీలో కనీస సౌకర్యాలు కరువు
- జీవీఎంసీలో విలీనమైనా అభివృద్ధిపై శీతకన్ను
- శిథిలావస్థలో రోడ్లు, కాలువలు
- నిర్వహణకు నోచుకోని పార్కులు
- రెచ్చిపోతున్న ఆక్రమణదారులు

సాగర్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని సాగర్‌నగర్ కాలనీలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్లు, కాలువలు శిథిలం కావడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. గుడ్లవానిపాలెం పంచాయతీలో వుండే ఈ కాలనీని 30 ఏళ్ల క్రితం ఉడా సాగర్‌నగర్ పేరుతో ఏర్పాటు చేశారు. జీవీఎంసీలో విలీనమైన తరువాత 8వ వార్డులో చేర్చారు. పేరుకు జీవీఎంసీ పరిధిలో ఉన్నా.. కనీస మౌలిక సదుపాయాలు లేవు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎంఐజీ డి, ఎల్ఐజీ సి బ్లాకుల మధ్య ఉన్న 40 అడుగుల రహదారి పునర్నిర్మాణానికి హడావిడి చేసింది. ఆ తరువాత ఆ విషయం మరిచారు. దీంతో నివాసితులు గోతులు పడిన రహదారిపై రాకపోకలు సాగించలేక ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఎంఐజీ డి, ఎంఐజీ సి బ్లాక్‌ల మధ్య ఉన్న సీసీ రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. హెచ్ఐజీ టు బాస్కెట్ బాల్ పార్కు, కళావేదిక వెనుక ఉన్న డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షం పడితే కాలువ పొంగి మురుగు నీరు రోడ్ల పైకి, ఇళ్లల్లోకి వస్తోంది. కాలనీలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

వెలగని వీధి లైట్లు.. అధ్వానంగా పార్కులు

కాలనీలో వీధిలైట్ల సమస్య ఎక్కువగా వుంది. ఎల్ఐజీ బి బ్లాక్‌లో లైట్లు వెలిగితే ఆరవు.. ఆరితే వెలగవు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. వీధి లైట్లకు ఉండాల్సిన టైమర్ పాడవ్వడంతో ఈ సమస్య నెలకొంది. కాలనీలో నాలుగు పెద్ద పార్కులు, మూడు చిన్న పార్కులు వున్నాయి. పార్కులు చుట్టూ 30 ఏళ్ల క్రితం ఉడా నిర్మించిన ప్రహరీ గోడలు కూలిపోయాయి. పార్కులన్నీ నిర్వహణ సక్రమంగా లేక అధ్వానంగా మారాయి. పెద్ద పార్కుల్లో పిల్లల ఆట వస్తువులు తుప్పు పట్టి మూలకుచేరాయి. కొన్నిచోట్ల తుప్పలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. కొన్ని పార్కులు గంజాయిబాబులకు అడ్డాగా మారాయి. అలాగే కాలనీవాసులకు సరైన రవాణా సౌకర్యం కూడాలేదు. ఆర్టీసీ సర్వీసులు తగిన సంఖ్యలో లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

ఆక్రమణల జోరు

కాలనీలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నాయి. కొందరు రోడ్లపైకి వచ్చి నిర్మాణాలు చేపడుతున్నారు. అల్లూరి సీతారామ రాజు విగ్రహం నుంచి బీచ్ రోడ్డు వరకు, శివాలయం దగ్గర నుంచి తాటిచెట్లపాలెం వరకు రహదారికి ఇరువైపులా బడ్డీలు పెట్టి, స్థలాలు ఆక్రమిస్తున్నారు. ముఖ్యంగా ఎస్‌బీఐ బ్యాంక్ దగ్గర నుంచి బీచ్‌రోడ్డు వరకు బడ్డీలు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం మార్కెట్‌ను తలపిస్తోంది. రోడ్లపైకి వచ్చి బడ్డీలు పెట్టడం వల్ల వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ట్రాఫిక్ సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. పాదచారులు పలుమార్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లు ఆక్రమించి బడ్డీల ఏర్పాటు చేయడంపై ఇప్పటికే కొందరు జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులకు వైసీపీ, టీడీపీ నాయకుల అండ ఉండడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కాలనీలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, గీతం యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు

ఉగ్రవాదాన్ని తరిమికొడదాం

- ఎంపీ ఎం. శ్రీభరత్
- కొవ్వొత్తులతో విద్యార్థుల ర్యాలీ

సాగర్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజలంతా ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలని ఎంపీ ఎం. శ్రీభరత్ పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడిలో మృతులకు సంతాపంగా గీతం విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ జి. సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ కశ్మీర్ పర్యాటకంగా అభివృద్ధి చెందడం, హోటళ్ల పరిశ్రమ పుంజుకోవడంతో అక్కడ ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. దీన్ని తీవ్రవాదులు జీర్ణించుకోలేక అమాయకులైన పర్యాటకులపై దాడులకు తెగపడ్డారని పేర్కొన్నారు. పర్యాటకులపై దాడులను ప్రపంచం మొత్తం ఖండిస్తోందని చెప్పారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. తొలుత వర్సిటీ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గీతం విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. గంగాధరరావు, వీసీ డాక్టర్ ఎరోల్ డిసౌజా, ప్రో వైస్ ఛాన్సలర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశేఖరన్, తదితరులు పాల్గొన్నారు.

అవంతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో...

భీమునిపట్నం : కశ్మీర్‌లోని పెహల్గాం ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ తగరపువలస అవంతి విద్యా సంస్థల విద్యార్థులు పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ నుంచి గంట స్తంభం మీదుగా బీచ్‌రోడ్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే ఉగ్రవాదులను దేశం నుంచి తరిమివేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ. చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్. హెచ్ షరీఫ్, జి. చిన్నయ్య, సంగీత మిశ్రా, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తగరపువలస : తగరపువలస కూడలిలో అఖిల పక్ష నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంత నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో చిప్పాడ మాజీ సైనికులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ఇండియన్ హ్యూమన్ రైట్స్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెందిన భాగం స్వాతి సుధాకర్ పాల్గొన్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 3 లక్షల విరాళం

సింహాచలం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి ముగ్గురు దాతలు లక్ష రూపాయల చొప్పున విరాళాలు సమర్పించారు. ముంబాయికి చెందిన పియూష రఘు వంశీ, అభినవ్ చతుర్వేది, విశాఖ సాగర్‌నగర్ ప్రాంతానికి చెందిన కొల్లి శివకాంత్ చెరో రూ. లక్ష చొప్పున మొత్తం రూ. 3 లక్షలను నగదు రూపంలో అన్నప్రసాద విభాగం ఏఈఓ పిళ్లా శ్రీనివాస్, పర్యవేక్షణాధికారి పి.సునీల్‌కు శుక్రవారం అందజేశారు. అలయ ఆచారం ప్రకారం అధికారులు దాతల కుటుంబ సభ్యులకు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రాలతో సత్కరించారు.

బెటాలియన్‌లో ప్రత్యేక గదులు ప్రారంభం


గదులను ప్రారంభిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

కొమ్మాది, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసులకు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడానికి ప్రభుత్వం అన్ని వసతులు సమకూర్చుతుందని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక చాంబర్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు సత్యం, నారాయణ,రామకృష్ణ, డీఎస్పీ ఇలియాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

జూట్‌మిల్లు కార్మికుల పింఛన్ సమస్యపై వినతి

తగరపువలస, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లులో పని చేసిన కార్మికుల పింఛన్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ కార్యాలయం ఎదుట చిట్టివలస పీఎఫ్ పింఛన్‌దారులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది కార్మికుల పింఛన్లు ఆన్‌లైన్ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఐదేళ్లుగా ఈ సమస్య ఉన్నా.. పరిష్కారం కావడం లేదని చెప్పారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు కానూరి రాంబాబు, కార్యదర్శి దామోదర బాలాజీ, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు పాల్గొన్నారు.

అమ్మో... కశ్మీరా

... 3వ పేజీ తరువాయి

నేరుగా జమ్మూకు వెళ్లిపోతున్నారు. అక్కడి నుంచి శ్రీనగర్‌కు విమానంలో వెళుతున్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీనగర్ నుంచి ఢిల్లీ వచ్చి, అక్కడి నుంచి రైలులో విశాఖపట్నం వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గత మూడేళ్లుగా ప్రతి వేసవిలో సుమారు ఐదు వేల మంది కశ్మీర్ పర్యటనకు వెళుతున్నారు. 2022 నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

100 శాతం వెనక్కి ఇస్తున్న విమాన సంస్థలు

వేసవిలో ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో అంతా కశ్మీర్ వెళుతుంటారు. ఇందుకోసం మూడు నెలల ముందుగానే విమానాలు, రైళ్లలో టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. విశాఖపట్నం నుంచి ఈ (ఏప్రిల్) నెలలో ఢిల్లీ మీదుగా శ్రీనగర్ వెళ్లడానికి 800 మంది టికెట్లు బుక్ చేసుకున్నారు. వారిలో ఇప్పటికే 500 మంది వెళ్లి వచ్చేశారు. ఇంకో 300 మంది వెళ్లాల్సి ఉంది. ఇప్పుడు వారంతా టికెట్లు రద్దు చేసుకుంటున్నారు. విమాన సంస్థలు 100 శాతం రిఫండ్ ఇస్తున్నాయి. రైళ్లలో కూడా నిబంధనల ప్రకారం టికెట్ డబ్బులు వెనక్కి ఇస్తున్నారు. వచ్చే నెల మే నెలలో ఇంకో 250 మంది విమానాల్లో వెళ్లాల్సి ఉంది. వారిలో 75 శాతం రద్దు చేసుకోగా, 25 శాతం రద్దు చేసుకోకుండా హోల్డ్ చేసి ఉంచాల్సిందిగా కోరుతున్నారు. పరిస్థితులు ఎలా ఉంటాయో చూసుకొని అప్పుడు రద్దు చేసుకుంటామని చెబుతున్నారు.

హోటల్ యాజమాన్యాల నిరాకరణ

విమాన, రైలు టికెట్లను రద్దు చేసుకోగలుగుతున్నారు కానీ అక్కడ శ్రీనగర్‌లో బుక్ చేసుకున్న హోటల్ గదులు మాత్రం క్యాన్సిల్ కావడం లేదు. అక్కడి యాజమాన్యాలు అంగీకరించడం లేదు. ఇప్పటికిప్పుడు రద్దు అంటే తాము ఎవరికి ఇచ్చుకోవాలంటూ వారు రిఫండ్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. దాంతో బుకింగ్ అడ్వాన్స్ మొత్తాలు కోల్పోవలసి వస్తోంది. ఉగ్రవాదుల దాడితో కశ్మీర్ పర్యటన అంటేనే భయపడిపోతున్నారు.

- కె.విజయమోహన్, అధ్యక్షులు,
ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్

చందనోత్సవం ఏర్పాట్లపై ఇన్‌చార్జి మంత్రి సమీక్ష


ఏర్పాట్లపై కలెక్టర్‌తో చర్చిస్తున్న మంత్రి వీరాంజనేయస్వామి, చిత్రంలో ఈఓ సుబ్బారావు, సీపీ శంఖబ్రత బాగ్చి

మహారాణిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సింహాచలం చందనోత్సవ ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, సింహాచలం దేవస్థానం ఈవో సుబ్బారావు తదితరులతో ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు.

గీతంలో మెటీరియల్ రీసెర్చి ల్యాబ్ ప్రారంభం

సాగర్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నూతన పదార్థవిజ్ఞాన పరిశోధనలో భాగంగా గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగంలో ఏర్పాటు చేసిన మెటీరియల్ రీసెర్చి ల్యాబ్‌ను ఆవిభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెటీరియల్ సైన్స్‌పై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అధ్యయనాలను దృష్టిలో ఉంచుకుని అధునాతన సాంకేతిక పరికరాలతో మెటీరియల్ రీసెర్చి ల్యాబ్‌ను నెలకొల్పామన్నారు. పదార్థ విజ్ఞానానికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా పరిశోధకులు నూతన ప్రాజెక్టులపై దృష్టిసారించాలన్నారు. రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్‌వీఎస్ వేణుగోపాల్ మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో బీఎస్సీ, ఎంఎస్సీ నిర్వహిస్తున్నామని, అలాగే పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా కోర్సులు రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ పర్యవేక్షక అధికారి డాక్టర్ హరిహరపాడి, అధ్యాపకులు, పరిశోధకులు, తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సాగర్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. 'రుషికొండ బీచ్‌ను వీడని నిర్లక్ష్యం' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వచ్చిన కథనానికి పర్యాటక శాఖాధికారులు స్పందించారు. కొద్ది రోజులుగా బీచ్‌కు పెద్ద ఎత్తున చెత్త, వ్యర్థాలు కొట్టుకువచ్చాయి. దీంతో బీచ్ కలుషితంగా తయారైంది. సందర్శకులు వ్యర్థాలను చూసి స్నానాలు చేయకుండా వేరే ప్రాంతానికి తరలివెళ్లేవారు.ఈనేపథ్యంలో బీచ్ క్లీనింగ్ పనులు ముమ్మరంగా చేస్తున్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ


ఎల్‌వీపాలెం పంచాయతీలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆనందపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన అవసరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి షహనాజ్ సాధియా అన్నారు.శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ఎల్‌వీపాలెం పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా దోమ కుట్టడం వల్ల వస్తుందని, దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం వంటి కార్యక్రమాలు విధిగా పాటించాలన్నారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం

సింహాచలం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి పదిహేడు రోజుల పాటు నిలిచిపోయిన ఆర్జిత సేవలు శుక్రవారం పునఃప్రారంభమయ్యాయి. వార్షిక తిరుకల్యాణోత్సవాల అంకురార్పణతో ఈనెల 7 నుంచి ఈ సేవలను నిలిపివేశారు. ఈమేరకు శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి సహస్రనామ తులసీ దళార్చన, గరుడసేవలు జరిపారు. అనంతరం నిత్య కల్యాణాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు నైతిక విలువలు ముఖ్యం

భీమునిపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) :ప్రతి విద్యార్థి నైతిక విలువలను అలవర్చుకోవాలని ప్రవచనకర్త రామకృష్ణానంద అభిప్రాయపడ్డారు. స్థానిక శ్రీనివాసా ఫంక్షన్ హాల్‌లో కళాసాహితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి శిబిరాల వల్ల పిల్లల్లో మానసిక వికాసం మెరుగవుతుందన్నారు. కళా సాహితి అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ తిరుమలరావు, బులుసు వెంకటేశ్వర్లు,పెద్దబాబు, పిజె సత్యనారాయణ పట్నాయక్, హరి పాల్గొన్నారు.

డీఆర్‌సీలో సమస్యల ఏకరువు

... 3వ పేజీ తరువాయి

పదేపదే సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపిస్తున్నారన్నారు. గాజువాకలో చెరువుల్లో లేఅవుట్‌లు వేసి (సిద్ధార్థ నగర్, ఆర్టీసీ కాలనీ) ప్రభుత్వమే భూమి అమ్మిందని, ఇప్పుడు వాటిని 22-ఎలో చేర్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి రోడ్డు నిర్మించే క్రమంలో నిరాశ్రయులైన వారికి కేటాయించిన ఇళ్ల కాలనీని కూడా 22-ఎలో పెట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్నానని ఆరోపించారు. కొత్తగాజువాక నుంచి లంకెలపాలెం వరకూ సర్వీస్ రోడ్డు ఏర్పాటుచేయాలని కోరారు. గంగవరం పోర్టు నిర్వాసితులకు ఉద్యోగాలు, ఇతర ప్యాకేజీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ వేపగుంట-పినగాడి రోడ్డు నిర్మాణ పనుల్లో కాలయాపన జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపామని, ఎన్‌డీబీ సాయంతో పనులు చేపడతామన్నారు. చిన ముషిడివాడ సర్వే నంబరు 163లో ఆక్రమణలు తొలగించాలని రమేష్‌బాబు కోరారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ సదరం స్లాట్ బుకింగ్‌లో ఇబ్బందులు తొలగించాలని, ప్రజలకు సమీపంలో ఆస్పత్రులలో స్లాట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరాసలో రాత్రిపూట అల్లరిమూకల చెలరేగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తూ వారిని నియంత్రించాలన్నారు. కాకానినగర్ వద్ద హైవేపై అండర్‌పాస్ ఏర్పాటుచేయాలని కోరగా త్వరలో పనులు చేపడతామని వీఎంఆర్‌డీఏ కమిషనర్ తెలిపారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ రాంజీ ఎస్టేట్‌లో ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరగా...పాఠశాలను పరిశీలించామని, త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ పేర్కొన్నారు. మాధవధారలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేయగా...భూ వివాదాల కేసులపై దృష్టిసారించామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. విశాఖ నుంచి విజయవాడకు విమాన సర్వీసులు పునరుద్ధరించాలని ఎమ్మెల్యే కోరారు. ఫిల్మ్‌నగర్ క్లబ్‌కు స్థలం కేటాయింపుపై పునఃపరిశీలన చేయాలంటూ ఎమ్మెల్యేలు సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో నగర పరిసరాల్లో పలు మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి గురించి వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ వివరించారు. అయితే నేరేళ్లవలస-తాళ్లవలస మాస్టర్ ప్లాన్ రోడ్ అభివృద్ధిపై ఎమ్మెల్యేలు వెలగపూడి, వంశీకృష్ణ శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తంచేస్తూ వైసీపీ నేతలకు చెందిన భూములకు ప్రయోజనం కోసం ఆ రోడ్డు ఉపయోగపడుతుందన్నారు. ఆ రోడ్డు నిర్మిస్తే అక్కడ ఉన్న వీఎంఆర్‌డీఏకు చెందిన భూములకు విలువ పెరుగుతుందని కమిషనర్ వివరణ ఇవ్వగా మంత్రి జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తరువాత నిర్ణయం తీసుకోవాలని స్పష్టంచేశారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ అధికారుల తీరులో మార్పు రావాలని, ఒకేచోట ఎక్కువకాలం పనిచేసే ఉపాధ్యాయులను తప్పకుండా బదిలీలు చేయాలని కోరారు. నగరంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అంటూ ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

నగరానికి ఆనుకుని మేహాద్రిగెడ్డ, గంభీరం రిజర్వాయర్లను జీవీఎంసీకి అప్పగించాలన్న అంశంపై పలువురు సభ్యులు ప్రస్తావించారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు ఏటా రూ.5 కోట్లు ఖర్చు అవుతుందని, నిర్వహణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం జల వనరుల శాఖకే ఉందని అధికారులు పేర్కొన్నారు. గంభీరం నిర్వహణ బాధ్యతలు జీవీఎంకి అప్పగించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని వెల్లడించారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎన్టీఆర్ వైద్య సేవ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, డీఆర్వో సత్తిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ప్రస్తుతం జరుగుతున్న పనులు, చేపట్టబోయే ప్రాజెక్టులు, మాస్టర్‌ప్లాన్ రోడ్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

నేడు ముఖ్యమంత్రి రాక

... 3వ పేజీ తరువాయి

సాయంత్రం 5.25 గంటలకు బయలుదేరి 5.45 గంటలకు నగరంలోని కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో 5.55 గంటలకు ఆంధ్ర వైద్య కళాశాలకు చేరుకుని, శతాబ్ది ఉత్సవాలకు గుర్తుగా నిర్మించిన సెంటినరీ అలూమ్ని భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వైద్యులతో వివిధ అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం 6.55 గంటలకు ఏఎంసీ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 7.15 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని 7.25 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళతారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.50 కోట్ల వ్యయంతో సెంటినరీ అలూమ్ని భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణానికి నిధులు సమీకరించే కమిటీకి చైర్మన్‌గా ప్రముఖ వైద్యులు డాక్టర్ టి.రవిరాజు వ్యవహరించారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లోని సుమారు 300 మంది వైద్యుల ఆర్థిక సహకారంతో నాలుగు అంతస్థుల్లో ఈ భవనాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. సుమారు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన భవనంలో 600 మంది కూర్చునేలా అధునాతన ఆడిటోరియం ఉంది. ఎల్ఈడీ స్క్రీన్స్‌తో పాటు వైద్య విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా పెద్ద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. డిజిటల్ లైబ్రరీని కూడా అందుబాటులో ఉంచారు. రీడింగ్ రూమ్స్, లెక్చర్ హాల్స్ ఉన్నాయి. ఏఎంసీ చరిత్రతో పాటు పూర్వ విద్యార్థుల్లో ప్రముఖుల జీవిత విశేషాలు, ఇతర అంశాలకు సంబంధించిన ఎగ్జిబిషన్ హాల్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ భవన నిర్మాణానికి గతంలో ప్రిన్సిపాళ్లుగా పనిచేసిన టి.రాధ, పీవీ సుధాకర్, బుచ్చిరాజు, కుమార్ విశేష కృషిచేశారు.

శతాబ్ది సంబరాలకు వేళాయె

... 3వ పేజీ తరువాయి

26న శతాబ్ది ఉత్సవ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు.ఈ సందర్భంగా సభ్యుల నుంచి కార్యక్రమాల నిర్వహణపై సూచనలు స్వీకరించారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వాక్‌థాన్‌ను శనివారం ఉదయం ఆరు గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. అనంతరం సిరిపురం వద్ద ఉన్న సీఆర్ రెడ్డి సర్కిల్, స్నాతకోత్సవ మందిరం, ఏయూ పరిపాలనా భవనం వద్ద ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించనున్నట్టు తెలిపారు. ఆ తరువాత శతాబ్ది ఉత్సవాలను ప్రతిబింబిస్తూ ప్రత్యేకంగా తయారుచేసిన బెలూన్‌ను నగర పోలీస్ కమిషనర్ ఎగురవేస్తారన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రధాన వేడుకలు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఏయూ విజన్ డాక్యుమెంట్, లోగో ఆవిష్కరణ, ప్రత్యేక నృత్య రూపకల్పన, తదితర కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్, ఉప కులపతి, అతిథుల ప్రసంగాలు ఉంటాయి.సాయంత్రం 6.30 వరకు ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని అధికారులు భావిస్తున్నారు. సమావేశంలో రెక్టార్ ఎస్.కిశోర్‌బాబు, ఏయూ క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ దీప కాంతులతో ప్రాంగణం

శతాబ్ది ఉత్సవాల ప్రారంభం నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యుత్ కాంతులతో వెలుగులీనుతోంది. వర్సిటీ పరిపాలనా భవనం, ప్రవేశ మార్గాలు, విభాగాలు, పలు భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

దంపతుల హత్య

... 3వ పేజీ తరువాయి

ఎవరైనా హత్య చేశారా?, అనే కోణంలో పరిశీలిస్తున్నారు. హత్య జరిగి 24 గంటలు అయి ఉంటుందని (బహుశా గురువారం రాత్రి) పోలీసులు చెబుతున్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన యోగీంద్రబాబు, విశాఖ రామకృష్ణాపురానికి చెందిన లక్ష్మి ప్రేమ వివాహం చేసుకున్నారు.

వారికి ఇద్దరు పిల్లలు (సుజిత్, శిల్ప) ఉన్నారు. ఇరువురూ అమెరికాలో ఉన్నారు. లక్ష్మి ప్రస్తుతం స్థానిక గ్లోరియా స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారని స్థానికులు తెలిపారు.

చంద్రమౌళికి కడసారి నివాళి

... 3వ పేజీ తరువాయి

మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, తదితరులు నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం అమానుష చర్య అన్నారు. కాగా చంద్రమౌళిని తలంచుకుంటూ భార్య నాగమణి, పిల్లలు నిహారిక, అనిమిత్ర భోరున విలపించారు. దీంతో అక్కడ ఉద్విగ్న వాతావరణం నెలకొంది.

ఏయూ వందేళ్ల ఉత్సవానికి ప్రాధాన్యమివ్వాలి

సీఎంకు ఏయూ వర్గాల వినతి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఏయూ వంద సంవత్సరాల వసంతోత్సవాల భాగంగా వర్సిటీని పర్యటించి గుర్తించవలసినదిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఏయూ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు నాన్-టీచింగ్ అభ్యర్థులు, పూర్వ విద్యారుల సంఘం సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శ్రీకాకుళం పర్యటన సందర్భంగా విశాఖలో ట్రాన్సిట్ హాల్ట్ సందర్భంగా వర్సిటీ పర్యటించాలన్నారు. అలాగే వర్సిటీలో విద్యార్థి నాయకుడి నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగిన సందర్భంగా ఏయూని గుర్తించి వర్సిటీకి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఉత్సవాలకు రాకపోవడం దురదృష్టకరమని, అందువల్ల ఏర్పాట్లు కూడా ఘనంగా లేవని, వంద వసంతాల సందర్భంగా అతిథి అధ్యాపకులకు నెలవారీ జీతం ఇవ్వాలని ప్రకటన ద్వారా ఏయూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్ మీనన్ విజ్ఞప్తి చేశారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-2 పరిధిలోని 5, 6, 7, 8 వార్డుల పరిధిలో గల ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ జోన్-2 వార్డు నెం 5, 6, 7, 8 పరిధిలో గల తాగు నీటిని సరఫరా చేయు ప్రధాన వనరు అయిన గోస్తని హెడ్ వాటర్ వర్క్సులో తాగునీటిని పంపింగ్ చేసే ప్రధాన పైప్‌లైన్ పంప్ హౌస్ వద్ద, మారికవలస మెట్రో హోల్ సేల్ ఎదురుగా లీకులకు గురికావడవ వల్ల మరమ్మతు చేయు నిమిత్తము శనివారం నీటి పంపింగ్ నిలుపుదలచేస్తున్నట్టు తెలిపారు. అందువల్ల జోన్-2 వార్డు నెం.5 బోరవానిపాలెం, సాయిరాం కాలనీ, వార్డు నెం.6 కొమ్మాది విలేజ్, ఎంఎస్ఆర్ లే అవుట్, సాయిప్రియ లే అవుట్, సంపత్‌నగర్, లక్ష్మీవానిపాలెం ఎస్సీ కాలనీ, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, పీఎంపాలెం, అశోక్ నగర్, తులసినగర్, వార్డు నెం.7 చంద్రం పాలెం, కళానగర్, కృష్ణ నగర్, యన్ జీఓస్ కాలనీ, వార్డు నెం.8 మిథిలాపురి వుడాకాలనీ, పాత మధురవాడ, ఏపీహౌసింగ్ బోర్డు కాలనీ, షిర్డీ లేఔట్, బింద్రానగర్, తారకరామ నగర్, చాణిక్య పురి లేఔట్, పీర్లెస్ కాలనీ, తదితర ప్రాంతములలో తాగునీటి సరఫరాకు అంతరాయంఏర్పడుతుందన్నారు.ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు సహకరించాలని జీవీఎంసీ తాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు కోరారు.

నేడు నూకాంబిక అమ్మవారి ఊరేగింపు

పెదగంట్యాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లోని శ్రీనూకాంబికా అమ్మవారం ఊరేగింపు కార్యక్రమం శనివారం నిర్వహించనున్నారు. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆలయన నిర్మాణ, నిర్వాహకకమిటీ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నది. మధ్యాహ్నం నాలుగున్నర గంటలకు అమ్మవారి ఊరేగింపు ప్రారంభం కానుంది.

సినిమా గైడ్

● **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య(గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ),అరుణ(పెదగంట్యాడ), తాతా (తగరపు వలస)

● **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక) **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 10, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 30, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజి 14, క్యారెట్ 32 దొండకాయలు 16, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 24, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఆర్ట్స్ విద్యార్థులకు శత శాతం ఉద్యోగావకాశాలకు ప్రణాళిక

ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహారావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహారావు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏయూలో ఆర్ట్స్ కళాశాల పరిధిలో పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు శత శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్టు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహా రావు పేర్కొన్నారు. సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కెరీర్ ప్లానింగ్ అండ్ ప్రొఫెషనల్ స్కిల్స్ ఫర్ సోషల్ వర్క్ స్టూడెంట్ అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. వందేళ్లు పూర్తి చేసుకున్న విశ్వ కళామతల్లి లక్షలాది మంది విద్యార్థులను జాతికి అందించిందని కీర్తించారు. పూర్వ విద్యార్థులే వర్సిటీకి తరగని సందగా పేర్కొన్నారు. సోషల్ వర్క్ విభాగం అధిపతి ఎస్.హరనాథ్ మాట్లాడుతూ సోషల్ వర్క్ పూర్తి చేసిన విద్యార్థులకు అపారమైన ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సామాజిక దృక్పథం విద్యార్థులకు ఎంతో ముఖ్యమన్నారు. పేదరికం ప్రగతికి అడ్డు కాదన్నారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ జె.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కెరీర్‌ను మలచుకునే విధానం ఎంతో ముఖ్యం అన్నారు. ఇందుకోసం కమ్యూనికేషన్స్, అధ్యయనం, నిరంతర శ్రమ ఎంతో అవసరమన్నారు.

పోర్టు ట్రస్టు డిప్యూటీ ట్రాఫిక్ మేనేజరు డాక్టర్ అవతారం నాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను విద్యార్థులు సాకారం చేయాలన్నారు. మెడ్‌టెక్ జోన్ సైంటిస్ట్ వినయ్ కుమార్ మాట్లాడుతూ సోషల్ వర్క్ పూర్తి చేసిన విద్యార్థులకు అనేక విభాగాల్లో ఫెలోషిప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. సుమారు పది రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఫెలో షిప్‌లు కూడా ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ రాములు, అధ్యాపకులు డాక్టర్ కోమలి సలోమి, అబ్రహం, శ్యామ్‌కుమార్, ఆశాకిరణ్, పుష్పలత, లక్ష్మణరావు, శిరీష, అమిత, సూరిబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిపై నిరసనలు



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



చంద్రమౌళికి నివాళులు అర్పిస్తున్న మానసిక దివ్యాంగులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదంతో దేశ భద్రతకు ముప్పు వస్తుందని ఏయూ విద్యా విభాగాధిపతి టి.షారోన్‌రాజు అన్నారు. కశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిలో అసువులు బాసిన వారికి శుక్రవారం విభాగంలోని విద్యార్థులతో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమాయకులైన పర్యాటకులపై ముష్కర మూకలు విరుచుకుపడటం, ప్రాణాలను హరించడం శోచనీయమన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మౌనం పాటించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఇటువంటి చర్యలకు తగిన గుణపాఠం, సమాధానం చెప్పాలన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటూ మృతుల కుటుంబాలకు బాసటగా నిలిచి మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విభాగాచార్యులు డాక్టర్ ఆలీ, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ సాల్మన్, డాక్టర్ రాము విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

హిడెన్ స్ప్రౌట్స్ దివ్యాంగుల పాఠశాలలో..

పెదవాల్తేరు, ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల చేతిలో చంద్రమౌళి బలికావడం దురదృష్టకరమని హిడెన్ స్ప్రౌట్స్ దివ్యాంగుల పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాస రావు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రమౌళికి మానసిక దివ్యాంగులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ చంద్రమౌళికి హిడెన్ స్ప్రౌట్స్ ప్రత్యేక పాఠశాలతో చాలా అనుబంధం ఉందన్నారు. అయన బ్యాంకర్స్ విశ్రాంతి ఉద్యోగుల తరపున ఈ పాఠ శాలకు అన్ని విధాలా సహాయసహకారాలు అందించారని గుర్తు చేశారు. ఈ మధ్య కాలంలో మా పాఠశాలకు వచ్చి ఇక్కడ పిల్లలందరికీ అన్నాదానం కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారన్నారు. వారి హఠాస్మరణం చాలా దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఇలాంటి సామాజిక సేవా దృక్పథం కలిగిన వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు.

ముస్లింల నివాళి..

పెదవాల్తేరు, ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి) : చినవాల్తేరులోని మొహమ్మదియా మసీదులో శుక్రవారం ప్రార్థనలు అనంతరం ముస్లిం సోదరులు అందరూ ముక్తకంఠంతో పెహల్గాంలో జరిగిన దారుణ మరణకాండను తీవ్రంగా ఖండించారు. అనంతరం అమరులైన వారికి ఘన నివాళులు అర్పించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం నల్ల బ్యాండ్ ధరించి తమ నిరసనను తెలియజేస్తూ 'టెర్రరిజం నశించాలని, దోషులను కఠినంగా శిక్షించాలి' అంటూ నినాదాలు చేశారు.



నిరసన తెలుపుతున్న ముస్లింలు

తోటగరువు స్కూలు సిబ్బంది ఆధ్వర్యంలో 'బడి పిలుస్తోంది' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు ప్రాథమిక పాఠశాలలో బడి ఈడు పిల్లలను చేర్పించి వారికి బంగారు భవిషత్తు అందించాలని కోరుతూ శుక్రవారం ఉదయం తోటగరువు గ్రామంలో గల కాలనీల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం విశ్వనాథం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయలు విద్యను బోధిస్తారని, ఒత్తిడి లేని చదువు, నాణ్యమైన విద్య, వివిధ సహ- పాఠ్యాంశాలు, వ్యాయామాలు, యోగా వంటివి బోధిస్తారన్నారు. పాఠశాలలో చేరవలసిన విద్యార్థుల తలిదండ్రులు తమ పిల్లల ఆధార్‌కార్డు తీసుకు వచ్చి పాఠశాలలో చేర్పించవచ్చని తెలిపారు.

కార్యక్రమంలో సీఆర్పీ ఎం.అప్పలరాజు, ఎస్ఎంసీ సభ్యులు నజ్మా, రోజా, రమేష్, పద్మ, లక్ష్మణ్, షజానా పాల్గొన్నారు.

దేశ రక్షణలో ప్రభుత్వ అధికారులతో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ భాగమే

వైజాగ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జాలాది శ్రీనివాసరావు

సిరిపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణలో ప్రభుత్వ అధికారులతో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ కూడా భాగమేనని వైజాగ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జాలాది శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సిరిపురం వీఐపీ రోడ్డులోని ఓ హోటల్‌లో వీపీఎస్ఏఏ సభ్యుల జనరల్ మీటింగ్ నిర్వహించారు. ముందుగా నల్ల రిబ్బన్లను ధరించి ఉగ్రవాది దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలోని ప్రభుత్వ అధికారులతో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ కూడా తమవంతు పాత్ర పోషిస్తుందన్నారు. సెక్రటరీ సీహెచ్ఎస్ మూర్తి మాట్లాడుతూ కార్మిక శాఖ, జీఎస్టీ, ఈఎస్ఐ, పీఎఫ్ అన్ని గైడ్‌లైన్స్ పాటిస్తూనే తమకు ఇబ్బందులొచ్చినప్పటికీ కచ్చితంగా ఉపాధి కల్పిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. సమావేశంలో కోశాధికారి టి.మోహన్‌రాజు, సలహాదారుడు శాంతిచంద్ర, జాయింట్ సెక్రటరీలు గవ్వా శ్రీనివాసరావు, దంతేశ్వరరావు, అడ్మిన్ కిషోర్, సభ్యులు సత్యారావు, హరీష్‌కుమార్, చిన్నారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాలాది శ్రీనివాసరావు, పాల్గొన్న సంఘం ప్రతినిధులు

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తమ తోటి ఆటగాడు, గురువైన స్వర్గీయ పల్లా పైడిరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం 16వవార్డు హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులోని కోర్టు-2లో నిర్వహించిన పైడిరాజు మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో మొదటి విజేతలుగా నిలిచిన ప్రసాద్, మహేష్ జట్లకు, రన్నర్స్‌గా నిలిచిన ఎం.రంగారెడ్డి, నాగభూషణరావులకు ట్రోఫీలను, అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్క ఆటగాడికి మెడల్స్‌ను మొల్లి అప్పారావు బహూకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పల్లా శ్రీను, పల్లా శివ, ప్రసాద్, ఒమ్మి కోటి, ఒమ్మి జగ్గారావు, శ్రీను, హరీష్, వంశీ, చిన్న, పల్లా ప్రసన్న, మహేష్, మణి, జనసేన నేతలు పీల వెంకటపరదేశినాయుడు, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌కు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం

సుబేదార్ మేజర్ జయప్రకాశ్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ సర్టిఫికెట్‌కు ఉద్యోగ నియామకాల్లో ఎంతో ప్రాధాన్యత ఉందని సుబేదార్ మేజర్ జయప్రకాశ్ అన్నారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు చెందిన 2023-25 ఎన్‌సీసీ క్యాడెట్లకు శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంధ్ర ట్రూప్ కమాండర్ చీఫ్ ఆఫీసర్ ఎంఎస్‌వీ విశ్వనాథం మాట్లాడుతూ 2023 జూన్‌లో ఇక్కడి పాఠశాలలో ఎన్‌సీసీ విభాగం ప్రారంభమైందన్నారు. జీవీఎంసీ పాఠశాలల్లో ఎన్‌సీసీ విభాగం ఉన్న ఏకైక పాఠశాల ఇదేనన్నారు. తొలి ఏడాది 40, రెండో ఏడాది 40 తరగతులు, ట్రైనింగ్ క్యాంప్ ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చామన్నారు. వీటికి 375 మార్కులు, లిఖిత పరీక్షలో 125 మార్కులు, డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ రేటింగ్, జడ్జింగ్ డిస్టెన్స్, సామాజిక సేవా కార్యక్రమాలపై మౌఖిక పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 500 మార్కులకు అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా ఎ, బి, సి గ్రేడ్ ధ్రువపత్రాలు ఇచ్చామన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు (576) సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్ అమలాపురం దినేష్‌కు రూ.6 వేల చెక్కు అందజేశారు.

బాస్కెట్‌బాల్ విజేత హకీంపేట జట్టు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో బాస్కెట్ బాల్ అండర్-17 పోటీలను కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్ శుక్రవారం ప్రారంభించారు. బాలురు, బాలికల 7 జట్లు పాల్గొన్నాయి. హకీంపేట విద్యార్థులు బేగంపేట విద్యార్థులపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖపట్నం బాస్కెట్ బాల్ కార్యదర్శి పి.భూషణ్‌రావు విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేయగా, ప్రిన్సిపాల్ కమల్‌జిత్ ట్రోఫీని అందజేశారు.

ఈశ్వరదేవీనగర్‌లో 15 రోజులుగా లో-వోల్టేజీ

ఆరిలోవ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల సాలిపేట కొండవాలు ప్రాంతంలో గల ఈశ్వరదేవీనగర్‌లో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తగా ఉంటోందని స్థానికుల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతానికి గత 15 రోజులుగా లో-వోల్టేజీతో సరఫరా జరగుతోందన్నారు. దీనివల్ల ఎలక్ట్రికల్ సామగ్రి పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి కావడంతో ఎలక్ట్రికల్ సామగ్రి పాడవడంతో మరింత ఇబ్బంగా ఉంటోందన్నారు. లో-వోల్టేజీ కారణంగా ఎలక్ట్రానిక్స్ వస్తువులు సరిగా పని చేయడం లేదని, దీనివల్ల రోజు వారీ కార్యక్రమాలకూ ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండి పడుతున్నారు. ఎండాకాలం కావడంతో ఫ్యాన్లు తిరగక, ఏసీలు వంటివి సరిగా పని చేయక ఇబ్బందిగా ఉందంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 11 వినతులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహించే టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి 11 వినతులు వచ్చాయని జీవీఎంసీ సిటీ ప్లానరు కె.ధనుంజయ్ రెడ్డి తెలిపారు.

చందనోత్సవ ఏర్పాట్లపై ఇన్‌చార్జి మంత్రి సమీక్ష

మహారాణిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సింహాచలం చందనోత్సవ ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, సింహాచలం దేవస్థానం ఈవో సుబ్బారావు తదితరులతో ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు.

భారీగా ఆస్తి పన్ను వసూలు



డీసీఆర్‌కు ఆర్‌టీజీ ప్రతిని అందజేస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 43వ వార్డులో ఉన్న ఏఎంఎన్ స్టీల్ ఇండియా కంపెనీ లిమిటెడ్ నుంచి జోన్-5 రెవెన్యూ అధికారులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1,21,59,606 ఆస్తి పన్ను వసూలు చేశారు. ఇందుకు సంబంధించిన ఆర్‌టీజీఎస్ ప్రతిని ఆర్‌ఓ రాజ్యలక్ష్మి, ఆర్‌ఐ శ్రీనివాసులు శుక్రవారం డీసీఆర్ శ్రీనివాస్‌కు అందజేశారు.

ప్రశాంతంగా ఏపీఆర్‌జేసీ పరీక్ష

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష శుక్రవారం గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం 2-30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షకు 204 మంది హాజరయ్యారని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.లక్ష్మీనరస తెలిపారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరయ్యారు.

నారీశక్తి యాప్‌పై అవగాహన



యాప్‌ను ఎలా వినియోగించాలో విద్యార్థినులకు చెబుతున్న ఎస్ఐ శ్రీనివాస్

సీతమ్మధార, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు సమాజంలో ఎదురయ్యే పలు ఇబ్బందులపై విద్యార్థినులకు నారీ శక్తి యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు ద్వారకా పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. స్టేషన్ పరిధిలోని పలు కళాశాలలు, గ్రంథాలయాల్లో విదార్థినులకు నారీ శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేయడంతో పాటు, దాని వినియోగంపై అవగాహన కల్పించారు. బాలికల సంరక్షణకు ప్రభుత్వం రూపొందించిన నారీశక్తి యాప్‌ను ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వెళ్లి వివరించారు.

కుట్టు శిక్షణతో ఉపాధి



ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మహిళల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు కోరారు. శుక్రవారం నేరెళ్ల కొనేరు వద్ద ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత దిశగా ఆలోచించి వివిధ కార్పొరేషన్‌ల ద్వారా ఈ పథకం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-4 ఏపీడీ పద్మావతి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, అప్పారావు, షేక్ నజీర్, సీఓ మంగ, బాలకృష్ణ పాల్గొన్నారు.

27న ఉచిత కంటి వైద్యశిబిరం

మురళీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మాక్సీ విజన్ కంటి ఆసుపత్రి సహకారంతో 27న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్స, కంటి అద్దాలను అందిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు కాటరాక్ట్, గ్లకోమా, రెటీనా పరీక్షలు ఉచితంగా చేపట్టే ఈ శిబిరాన్ని ఏ ప్రాంతం వారైనా వినియోగించుకోవచ్చని అన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పతకాల పంట



పతకాలు సాధించిన దివ్యాంగ క్రీడాకారులతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు తదితరులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసిన స్పెషల్ ఒలింపిక్స్ భారత్-2025 క్రీడా పోటీలు ఈ నెల 21 నుంచి 23 వరకు ఏలూరు జిల్లాలో జరిగినట్టు సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త జె.చంద్రశేఖరరావు తెలిపారు. క్రీడల్లో విశాఖకు చెందిన దివ్యాంగ విద్యార్థులు వి.రాజేష్ (బోకి గేమ్) బంగారు పతకం, పరుగు పందెంలో ఎస్.గిరీష్, బి.హర్షవర్ధన్ ఎం.జయంతకుమార్, ఎండీ నజీబుర్ రెహ్మాన్ వెండి, కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పతకాల సాధకులను అభినందించారు. వారికి మిఠాయిలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జిల్లాలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడల్లో మరింత ప్రోత్సాహం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా.ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ ఆశోక్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ చిరంజీవరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్, అదనపు సమన్వయకర్త బి.గీత, సాహిత్య విద్య సమన్వయకర్త ఉపధ్యాయ, కోచ్‌లు రవిబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని ముక్తకంఠంతో ఖండించాలి



డాబాగార్డెన్స్‌లో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ



మర్రిపాలెంలో ప్లకార్డులతో ముస్లింల నిరసన



తాటిచెట్లపాలెం జంక్షన్‌లో జనసేన మానవహారం

డాబాగార్డెన్స్/మర్రిపాలెం/అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అందరూ ముక్తకంఠంతో ఖండించాలని ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు పిలుపునిచ్చారు. శుక్రవారం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ బిల్డింగ్ ఆవరణలో 'టెర్రరిజాన్ని ఖండించండి మానవత్వాన్ని రక్షించండి' అని నినదిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీమా ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కామేశ్వరి, జి.వరప్రసాద్ మాట్లాడుతూ కశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన కాల్పుల్లో అసువులు బాసినవారిలో ఎల్ఐసీ మేనేజర్, ఏజెంట్ కూడా ఉన్నారని విచారం వ్యక్తం చేశారు. మృతులకు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఎల్ఐసీలోని వివిధ విభాగాల యూనియన్ నాయకులు త్రినాథ్, సత్యంబాబు, కె.రవికుమార్, దామోదరం, గణపతిరాం, బి.శ్రీనివాస్, హరనాథ్, నాగరాజు, ఠాగూర్, తిరుమలరావు, ఐసీఆర్‌ఈఏ నాయకుడు గణేష్, ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు. ఉగ్రదాడికి నిరసనగా మర్రిపాలెం జాకీరు హుస్సేన్‌నగర్ ముస్లింలు ర్యాలీ చేపట్టారు. అమాయకులను అత్యంత కిరాతకంగా పొట్టన పెట్టుకున్న ఉగ్రమూకలను అంతమొందించాలన్నారు. ఏ మత ధర్మమైనా ప్రాణాలు తీయటానికి అనుమతించదన్నారు. ఇది పిరికిపందల చర్య అని, అలాంటి నరహంతకులను ఉరి తీయాలన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పర్యాటకులపై ఉగ్రవాదుల మారణకాండ అత్యంత పాశవిక చర్య అని, వీరికి ఉరిశిక్ష విధించాలని జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ డిమాండ్ చేశారు. సాయంత్రం తాటిచెట్లపాలెం జంక్షన్‌లో మానవహారం నిర్వహించి నిరసన ప్రదర్శన చేశారు. ఆమె మాట్లాడుతూ దేశప్రజలంతా ఒక్కటి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంకు వేంకటేశ్వరరావు, తుమ్మల త్రినాథ్, పీలా హరి, గొరపల్లి శివ, బోడసింగి శ్రీధర్ పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ విజేతలతో న్యాయనిర్ణేత డాక్టర్ సూర్యారావు

సీతంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఉద్యోగార్థులకు శుక్రవారం క్విజ్ పోటీ నిర్వహించారు. వర్తమాన అంశాలు, ఆర్థిక వ్యవస్థ, చరిత్ర, రాజ్యాంగం, విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు, భూగోళశాస్త్రం తదితర విషయాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 60 మంది విద్యార్థులు 7 బృందాలుగా పాల్గొని క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించిన గ్రంథాలయ పాలకవర్గం కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. పోటీలను ప్రధాన గ్రంథ పాలకురాలు దుర్గారాణి పర్యవేక్షించారు. పోటీ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వీలుగా, వారు ఎదుర్కోబోయే పరీక్షలను తెలియజేస్తూ క్విజ్ పోటీలు నిర్వహించినట్లు డి.వి.సూర్యారావు తెలిపారు. క్విజ్ మాస్టర్‌గా, న్యాయనిర్ణేతగా వ్యవహరించిన డాక్టర్ సూర్యారావు విజేత విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ప్లాస్టిక్ సంచులు వాడితే చర్యలు తీసుకుంటాం

సీతమ్మధార, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తోపుడు బండ్ల వ్యాపారులు పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోన్-3 ఏఎంహెచ్‌ఓ దుర్గాప్రసాద్ హెచ్చరించారు. గ్రేటర్ విశాఖ 23, 24 వార్డుల పరిధి నక్కవానిపాలెం 80 అడుగుల రోడ్డు, జయభేరి రోడ్డు, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వాడుతున్న వ్యాపారులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ వినియోగం వలన నష్టాలను వివరించారు. జీవీఎంసీ ఎస్ఎస్ సత్యనారాయణ, శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

'మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఊరుకోం'



నిరసన తెలుపుతున్న ఇందిరానగర్ ప్రజలు

కంచరపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ స్థానికులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ఘటన జీవీఎంసీ 48వ వార్డు పరిధి ఇందిరానగర్-4 వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కంచరపాలెం జాతీయ రహదారి ఇందిరానగర్-4లో ఇరువైపులా జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుకు సంబంధిత వ్యక్తులు సరుకును తీసుకుని వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఇందుకు అభ్యంతరం తెలుపుతూ చుటుపక్కల నివాసులు, మహిళలు, చిన్నారులు ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి వీలులేదని అన్నారు. స్థానికులు అధికసంఖ్యలో గుమికూడి నిరసన తెలియజేశారు. ప్రజల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి వారికి సర్దిచెప్పారు. అయినా స్థానికులు నినాదాలు చేస్తూ మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ దుకాణం ఏర్పాటును అంగీకరించబోమని హెచ్చరించారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళి



సెయింట్ జోసెఫ్ కళాశాలలో అధ్యాపకుల నివాళి

జ్ఞానాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న తుదిశ్వాస విడిచిన కేథలిక్ చర్చ్ 266వ పోప్ ఫ్రాన్సిస్‌కు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో అధ్యాపకులు, యాజమాన్య ప్రతినిధులు శుక్రవారం నివాళులు అర్పించారు. 2013 నుంచి 2025 వరకు పోప్‌గా ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ప్రార్థనా సమావేశం నిర్వహించారు. అనంతరం పోప్ చిత్రపటం వద్ద ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, అధ్యాపక బృందం, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు.

అమ్మో...కశ్మీరా

... 3వ పేజీ తరువాయి

నేరుగా జమ్మూకు వెళ్లిపోతున్నారు. అక్కడి నుంచి శ్రీనగర్‌కు విమానంలో వెళుతున్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీనగర్ నుంచి ఢిల్లీ వచ్చి, అక్కడి నుంచి రైలులో విశాఖపట్నం వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గత మూడేళ్లుగా ప్రతి వేసవిలో సుమారు ఐదు వేల మంది కశ్మీర్ పర్యటనకు వెళుతున్నారు. 2022 నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

100 శాతం వెనక్కి ఇస్తున్న విమాన సంస్థలు

వేసవిలో ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో అంతా కశ్మీర్ వెళుతుంటారు. ఇందుకోసం మూడు నెలల ముందుగానే విమానాలు, రైళ్లలో టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. విశాఖపట్నం నుంచి ఈ (ఏప్రిల్) నెలలో ఢిల్లీ మీదుగా శ్రీనగర్ వెళ్లడానికి 800 మంది టికెట్లు బుక్ చేసుకున్నారు. వారిలో ఇప్పటికే 500 మంది వెళ్లి వచ్చేశారు. ఇంకో 300 మంది వెళ్లాల్సి ఉంది. ఇప్పుడు వారంతా టికెట్లు రద్దు చేసుకుంటున్నారు. విమాన సంస్థలు 100 శాతం రిఫండ్ ఇస్తున్నాయి. రైళ్లలో కూడా నిబంధనల ప్రకారం టికెట్ డబ్బులు వెనక్కి ఇస్తున్నారు. వచ్చే నెల మే నెలలో ఇంకో 250 మంది విమానాల్లో వెళ్లాల్సి ఉంది. వారిలో 75 శాతం రద్దు చేసుకోగా, 25 శాతం రద్దు చేసుకోకుండా హోల్డ్ చేసి ఉంచాల్సిందిగా కోరుతున్నారు. పరిస్థితులు ఎలా ఉంటాయో చూసుకొని అప్పుడు రద్దు చేసుకుంటామని చెబుతున్నారు.

హోటల్ యాజమాన్యాల నిరాకరణ

విమాన, రైలు టికెట్లను రద్దు చేసుకోగలుగుతున్నారు కానీ అక్కడ శ్రీనగర్‌లో బుక్ చేసుకున్న హోటల్ గదులు మాత్రం క్యాన్సిల్ కావడం లేదు. అక్కడి యాజమాన్యాలు అంగీకరించడం లేదు. ఇప్పటికిప్పుడు రద్దు అంటే తాము ఎవరికి ఇచ్చుకోవాలంటూ వారు రిఫండ్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. దాంతో బుకింగ్ అడ్వాన్స్ మొత్తాలు కోల్పోవలసి వస్తోంది. ఉగ్రవాదుల దాడితో కశ్మీర్ పర్యటన అంటేనే భయపడిపోతున్నారు.

- కె.విజయమోహన్, అధ్యక్షులు, ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌కు ఉద్యోగాల్లో ప్రాధాన్యం



సర్టిఫికెట్లు అందుకున్న క్యాడెట్లతో అధికారులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ సర్టిఫికెట్‌కు ఉద్యోగ నియామకాల్లో ఎంతో ప్రాధాన్యత ఉందని సుబేదార్ మేజర్‌జయప్రకాశ్ అన్నారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు చెందిన 2023-25 ఎన్‌సీసీ క్యాడెట్లకు శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంధ్ర ట్రూప్ కమాండర్ చీఫ్ ఆఫీసర్ ఎంఎన్‌వీ విశ్వనాథం మాట్లాడుతూ 2023 జూన్‌లో ఇక్కడి పాఠశాలలో ఎన్‌సీసీ విభాగం ప్రారంభమైందన్నారు. జీవీఎంసీ పాఠశాలల్లో ఎన్‌సీసీ విభాగం ఉన్న ఏకైక పాఠశాల ఇదేనన్నారు. తొలి ఏడాది 40, రెండో ఏడాది 40 తరగతులు, ట్రైనింగ్ క్యాంప్ ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చామన్నారు. వీటికి 375 మార్కులు, లిఖిత పరీక్షలో 125 మార్కులు, డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ రేటింగ్, జడ్జింగ్ డిస్టెన్స్, సామాజిక సేవా కార్యక్రమాలపై మౌఖిక పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 500 మార్కులకు అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా ఎ, బి, సి గ్రేడ్ ధ్రువపత్రాలు ఇచ్చామన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు (576) సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్ అమలాపురం దినేష్‌కు రూ.6 వేల చెక్కు అందజేశారు. క్యాడెట్లను, నగదు బహుమతి అందుకున్న దినేష్‌ను బెటాలియన్ ఎన్‌సీసీ విశాఖపట్నం కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్‌కుమార్, పాఠశాల హెచ్.ఎం. బి. లక్ష్మీనరస, హవల్దార్లు శ్యామలరావు, శుక్రరాజు, దమ్మర్ గురం, రవీందర్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్‌పర్సన్ వంగల అప్పలరాజు అభినందించారు.

డీఆర్‌సీలో సమస్యల ఏకరువు

... 3వ పేజీ తరువాయి

పదేపదే సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపిస్తున్నారన్నారు. గాజువాకలో చెరువుల్లో లేఅవుట్‌లు వేసి (సిద్ధార్థ నగర్, ఆర్టీసీ కాలనీ) ప్రభుత్వమే భూమి అమ్మిందని, ఇప్పుడు వాటిని 22-ఎలో చేర్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి రోడ్డు నిర్మించే క్రమంలో నిరాశ్రయులైన వారికి కేటాయించిన ఇళ్ల కాలనీని కూడా 22-ఎలో పెట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కొత్తగాజువాక నుంచి లంకెలపాలెం వరకూ సర్వీస్ రోడ్లు ఏర్పాటుచేయాలని కోరారు. గంగవరం పోర్టు నిర్వాసితులకు ఉద్యోగాలు, ఇతర ప్యాకేజీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ వేపగుంట-పినగాడి రోడ్డు నిర్మాణ పనుల్లో కాలయాపన జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపామని, ఎన్‌డీబీ సాయంతో పనులు చేపడతామన్నారు. చినముషిడివాడ సర్వే నంబరు 163లో ఆక్రమణలు తొలగించాలని రమేష్‌బాబు కోరారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ సదరం స్లాట్ బుకింగ్‌లో ఇబ్బందులు తొలగించాలని, ప్రజలకు సమీపంలో ఆస్పత్రులలో స్లాట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరాసలో రాత్రిపూట అల్లరిమూకల చెలరేగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తూ వారిని నియంత్రించాలన్నారు. కాకానినగర్ వద్ద హైవేపై అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కోరగా త్వరలో పనులు చేపడతామని వీఎంఆర్‌డీఏ కమిషనర్ తెలిపారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ రాంజీ ఎస్టేట్‌లో ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరగా...పాఠశాలను పరిశీలించామని, త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ పేర్కొన్నారు. మాధవధారలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేయగా..భూ వివాదాల కేసులపై దృష్టి సారించామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. విశాఖ నుంచి విజయవాడకు విమాన సర్వీసులు పునరుద్ధరించాలని ఎమ్మెల్యే కోరారు. ఫిల్మ్‌నగర్ క్లబ్‌కు స్థలం కేటాయింపుపై పునఃపరిశీలన చేయాలంటూ ఎమ్మెల్యేలు సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో నగర పరిసరాల్లో పలు మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి గురించి వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ వివరించారు. అయితే నేరేళ్లవలస-తాళ్లవలస మాస్టర్ ప్లాన్ రోడ్ అభివృద్ధిపై ఎమ్మెల్యేలు వెలగపూడి, వంశీకృష్ణ శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ వైసీపీ నేతలకు చెందిన భూములకు ప్రయోజనం కోసం ఆ రోడ్డు ఉపయోగపడుతుందన్నారు. ఆ రోడ్డు నిర్మిస్తే అక్కడ ఉన్న వీఎంఆర్‌డీఏకు చెందిన భూములకు విలువ పెరుగుతుందని కమిషనర్ వివరణ ఇవ్వగా మంత్రి జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తరువాత నిర్ణయం తీసుకోవాలని స్పష్టంచేశారు.

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ అధికారుల తీరులో మార్పు రావాలని, ఒకేచోట ఎక్కువకాలం పనిచేసే ఉపాధ్యాయులను తప్పకుండా బదిలీలు చేయాలని కోరారు. నగరంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అంటూ ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. నగరానికి ఆనుకుని మేహాద్రిగెడ్డ, గంభీరం రిజర్వాయర్లను జీవీఎంసీకి అప్పగించాలన్న అంశంపై పలువురు సభ్యులు ప్రస్తావించారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు ఏటా రూ.5 కోట్లు ఖర్చు అవుతుందని, నిర్వహణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం జల వనరుల శాఖకే ఉందని అధికారులు పేర్కొన్నారు. గంభీరం నిర్వహణ బాధ్యతలు జీవీఎంకి అప్పగించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని వెల్లడించారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎన్టీఆర్ వైద్య సేవ వైస్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, డీఆర్వో సత్తిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ప్రస్తుతం జరుగుతున్న పనులు, చేపట్టబోయే ప్రాజెక్టులు, మాస్టర్‌ప్లాన్ రోడ్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

శతాబ్ది సంబరాలకు వేళాయె

... 3వ పేజీ తరువాయి

26న శతాబ్ది ఉత్సవ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా సభ్యుల నుంచి కార్యక్రమాల నిర్వహణపై సూచనలు స్వీకరించారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వాక్‌థాన్‌ను శనివారం ఉదయం ఆరు గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. అనంతరం సిరిపురం వద్ద ఉన్న సీఆర్ రెడ్డి సర్కిల్, స్నాతకోత్సవ మందిరం, ఏయూ పరిపాలనా భవనం వద్ద ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించనున్నట్టు తెలిపారు. ఆ తరువాత శతాబ్ది ఉత్సవాలను ప్రతిబింబిస్తూ ప్రత్యేకంగా తయారుచేసిన బెలూన్‌ను నగర పోలీస్ కమిషనర్ ఎగురవేస్తారన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రధాన వేడుకలు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఏయూ విజన్ డాక్యుమెంట్, లోగో ఆవిష్కరణ, ప్రత్యేక నృత్య రూపకల్పన, తదితర కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్, ఉప కులపతి, అతిథుల ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం 6.30 గంటల వరకు ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని అధికారులు భావిస్తున్నారు. రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, ఏయూ క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ దీప కాంతులతో ప్రాంగణం

శతాబ్ది ఉత్సవాల ప్రారంభం నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యుత్ కాంతులతో వెలుగులీనుతోంది. వర్సిటీ పరిపాలనా భవనం, ప్రవేశ మార్గాలు, విభాగాలు, పలు భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేడు ముఖ్యమంత్రి రాక

... 3వ పేజీ తరువాయి

సాయంత్రం 5.25 గంటలకు బయలుదేరి 5.45 గంటలకు నగరంలోని కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో 5.55 గంటలకు ఆంధ్ర వైద్య కళాశాలకు చేరుకుని, శతాబ్ది ఉత్సవాలకు గుర్తుగా నిర్మించిన సెంటినరీ అలూమ్ని భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వైద్యులతో చర్చిస్తారు. సాయంత్రం 6.55 గంటలకు ఏఎంసీ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 7.15 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని 7.25 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళతారు.

ఆంధ్ర మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.50 కోట్ల వ్యయంతో సెంటినరీ అలూమ్ని భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణానికి నిధులు సమీకరించే కమిటీకి ఛైర్మన్‌గా ప్రముఖ వైద్యులు డాక్టర్ టి.రవిరాజు వ్యవహరించారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లోని సుమారు 300 మంది వైద్యుల ఆర్థిక సహకారంతో నాలుగు అంతస్థుల్లో ఈ భవనాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. సుమారు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన భవనంలో 600 మంది కూర్చునేలా అధునాతన ఆడిటోరియం ఉంది. ఎల్ఈడీ స్క్రీన్స్‌తో పాటు వైద్య విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా పెద్ద గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారు. డిజిటల్ లైబ్రరీని కూడా అందుబాటులో ఉంచారు. రీడింగ్ రూమ్స్, లెక్చర్ హాల్స్ ఉన్నాయి. ఏఎంసీ చరిత్రతోపాటు పూర్వ విద్యార్థుల్లో ప్రముఖుల జీవిత విశేషాలు, ఇతర అంశాలకు సంబంధించిన ఎగ్జిబిషన్ హాల్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ భవన నిర్మాణానికి గతంలో ప్రిన్సిపాళ్లుగా పనిచేసిన డాక్టర్ టి.రాధ, డాక్టర్ పీవీ సుధాకర్, డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ కుమార్ విశేష కృషిచేశారు.

చంద్రమౌళికి కడసారి నివాళి

... 3వ పేజీ తరువాయి

మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, తదితరులు నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం అమానుష చర్య అన్నారు.

తల్లడిల్లిన కుటుంబసభ్యులు

చంద్రమౌళిని తలంచుకుంటూ భార్య నాగమణి, పిల్లలు నిహారిక, అనిమిత్ర బోరున విలపించారు. దీంతో అక్కడ ఉద్విగ్న వాతావరణం నెలకొంది.

దంపతుల హత్య

... 3వ పేజీ తరువాయి

ఎవరైనా హత్య చేశారా?, అనే కోణంలో పరిశీలిస్తున్నారు. హత్య జరిగి 24 గంటలు అయి ఉంటుందని (బహుశా గురువారం రాత్రి) పోలీసులు చెబుతున్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన యోగీంద్రబాబు, విశాఖ రామకృష్ణాపురానికి చెందిన లక్ష్మి ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు (సుజిత్, శిల్ప) ఉన్నారు. ఇరువురూ అమెరికాలో ఉన్నారు. లక్ష్మి ప్రస్తుతం స్థానిక గ్లోరియా స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారని స్థానికులు తెలిపారు.

బాస్కెట్‌బాల్ విజేత హకీంపేట జట్టు



విజేతలతో అతిథులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో బాస్కెట్ బాల్ అండర్-17 పోటీలను కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్ శుక్రవారం ప్రారంభించారు. బాలురు, బాలికల 7 జట్లు పాల్గొన్నాయి. హకీంపేట విద్యార్థులు బేగంపేట విద్యార్థులపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖపట్నం బాస్కెట్ బాల్ కార్యదర్శి పి.భూషణ్‌రావు విజేతలకు మెడల్స్ సర్టిఫికెట్లు ప్రదానం చేయగా, ప్రిన్సిపాల్ కమల్‌జిత్ ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ రియాజ్‌ఖాన్, గిరి, రాణి, శైలజ పాల్గొన్నారు.

దుర్గమ్మకు పూజలు



అగనంపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొర్ర మాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అగనంపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు వేపచేట్టు జంక్షన్ వద్ద స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి బోసుబాబు, భాస్కరరాజులు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చలివేంద్రాన్ని ప్రయాణికులతో పాటు పాదచారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్ఎం రఫీ, గుదే సుశీల గజేంద్రరరావు, జయ వెంకటరావు, వరహాలు, విశ్వనాథం, కళిదాసు, ప్రసాద్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కణితి గ్రామ దేవతల కమిటీ నూతన కార్యవర్గం



రథాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87 వార్డు కణితిలో శుక్రవారం గ్రామ దేవతల కమిటీ ఆధ్వర్యంలో రథాలమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ప్రగడ శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా చిత్రాడ సన్యాసిరావు, అధ్యక్షుడిగా సూరిశెట్టి పెంటారావు, ఉపాధ్యక్షులుగా ప్రగడ శంకరరావు, దుగ్గపు సీహెచ్ వెంకటరమణ, బి.గోవింద్, దాక సత్తిబాబు, జి.సన్యాసినాయుడు, ప్రధా న కార్యదర్శిగా బడగల రాము, కోశాధికారిగా సాగి సీతారామరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఏడాది 46 కాలనీలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రథాలమ్మ అమ్మవారు భారీ పండుగ నెల రోజుల ఉత్సవాలను ఈ కమిటీ నిర్వహించనుంది.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18,టమాటా 10, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 30, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజి 14, క్యారెట్ 32 దొండకాయలు 16, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 24, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220



ఖెల్ హెచ్‌పీవీపీ మెయిన్‌గేటు ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు



గోపాలపట్నంలోని కొత్తపాలెం గ్రామంలో నమాజ్ అనంతర ర్యాలీ చేస్తున్న ముస్లింలు

ఉగ్రమూకల ఏరివేతతోనే ప్రపంచ శాంతి

» పహల్గాం ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ పలుచోట్ల ర్యాలీలు » ఇది హేయమైన చర్య : వక్తలు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రమూకల ఏరివేతతోనే ప్రపంచ శాంతి ఏర్పడుతుందని బీజేపీ కన్వీనర్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం కూర్మన్నపాలెంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందువులపై ఉగ్రవాదులు దాడికి పాల్పడడం పిరికిపంద చర్య అన్నారు. జమ్మూ కశ్మీరు పర్యటనకు వెళ్లిన అమాయక టూరిస్టులను ఐడీలు అడిగి హిందూ మతానికి చెందిన వారిగా భావించి అత్యంత కిరాతకంగా కాల్చి చంపారన్నారు. దీన్ని యావత్తు ప్రపంచం హేయమైన చర్యగా భావిస్తోందన్నారు. కార్యక్రమంలో దువ్వాడ సీఐలు కె. వెంకట్రావు, మల్లేశ్వరరావు, ఎస్ఐలు శ్రీనివాసరావు, బీజేపీ స్థానిక నాయకులు బొండా ఎల్లాజీ, శ్రీదేవి, వెన్నా శ్రీరామ్మూర్తి, వి.బంగార్రాజు, కృష్ణంరాజు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం : జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం బెల్ హెచ్‌పీవీపీ మెయిన్‌గేటు ఎదుట ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కార్మికులు, బెల్ హెచ్‌పీవీపీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్ క్రీడా మైదానంలో వాకర్స్ క్రీడాకారులు నిరసన తెలిపారు. ఉగ్రదాడికి పాల్పడిన వారితో పాటు వారికి అండగా నిలిచిన వారికి కేంద్ర ప్రభుత్వం తగిన శిక్ష విధించాలని, ఇందుకు ప్రజలందరూ సంఘీభావం ప్రకటించాలని కార్పొరేటర్లు కాకి గోవింద రెడ్డి, పల్లా శ్రీనివాసరావు కోరారు. బెల్ మెయిన్‌గేటు ఎదుట జరిగిన నిరసన ప్రదరనలో జీటీపీ ప్రకాశ్, సనపల జగన్నాథ రావు, సీతంనాయుడు, కె.నారపరెడ్డి తదితరులు పాల్గొనగా, బెల్ క్రీడామైదానంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లతో పాటు అసోసియేషన్ నాయకులు ఇ.అనార్‌బాబు, సంద్రాన నూకరాజు, ఉరుకూటి కనకరాజు, గొగినేని సుధాకర్, సీహెచ్ మురళీశ్వరరావు, వి.బాబూరావు, జె.రమణ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ : కశ్మీర్‌లోని పేపహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు దాడిచేసి కాల్పులు జరపడాన్ని తీవ్రఖండిస్తూ సీపీఐ గాజువాక నియోజక వర్గం కమిటీ శుక్రవారం కాకతీయ జంక్షన్ నుంచి బీసీ రోడ్డులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా గాజువాక నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి కెసత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదం పెరిగి పోయిందని, దీన్ని తుదముట్టించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పల్లేటి పోలయ్య, కె.పోతయ్య, పిదుర్గారావు, పల్లేటి అప్పారావు, మహిళా సమాఖ్య నేతలు కె.వ నజాక్షి, పిల్లా సూర్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

89వ వార్డులో శాంతి ర్యాలీ

గోపాలపట్నం : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని నిరసిస్తూ 89వ వార్డు కొత్తపాలెం గ్రామంలో ముస్లింలు శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నమాజ్‌కు హాజరయ్యారు.నమాజ్ తరువాత గ్రామంలోని మసీదు నుంచి కొత్తపాలెం అండర్ పాత్ వే వరకూ ర్యాలీ నిర్వహించారు.ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ఏనూరానియా కమిటీ సభ్యులు, సుమారు 200 మంది ముస్లింలు పాల్గొన్నారు. అలాగే బాజీ జంక్షన్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడికి ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు భద్రతా విభాగాధిపతికి అభినందనలు



ఫణికుమార్‌ను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన జి. ఫణికుమార్‌ను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ ప్లాంట్‌ను ప్రమాదరహితంగా మార్చటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. పని ప్రదేశాల్లో భద్రత పాటించాలని సూచించారు. కంపెనీ భద్రతా నియమాలను ప్రతిఒక్కరూ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, డీజీఎం వైవీ రావు, ప్రతినిధులు ఎం. వరప్రసాదరావు, బీకే మిత్రా, మోహన్‌రావు, సాయిప్రసాద్, పుల్లారావు, మోహన్‌బాబు, ప్రసాద్, కృష్ణమూర్తి, అభిజిత్ శర్మ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థినికి సత్కారం

అగనంపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ విద్యాసంస్థల్లో 587 మార్కులు సాధించి గాజువాక మండల టాపర్‌గా నిలిచిన శిశిరను ఎంఈఓ సునీత అభినందించారు శుక్రవారం ఆమె అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి శిశిరను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, పాఠశాల కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

వేపగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 94వ వార్డు వేపగుంటలో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం శాంతి హోమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పరస జరిగింది.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీలు



తిరుమల నగర్‌లో మలేరియా అవగాహన ర్యాలీ



మలేరియా అవగాహన ర్యాలీని ప్రారంభించిన బొండా జగన్

కూర్మన్నపాలెం,ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టయితే విష జ్వరాలు రావని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని 87వ వార్డు తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఫ్రిడ్జ్, ఏసీలు, మేడపై డబ్బాలు, పూల కుండీలు, ఇంటి పరిసరాలను పరిశీలించారు.నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఎస్సై అప్పారావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డి, మూర్తి పలువురు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కణితి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

దోమల వ్యాప్తికి కారణాలను తెలుసుకొని అప్రమత్తంగా మెలగితే విష జ్వరాల బారిన పడే పరిస్థితి రాదని 87వ వార్డు కార్పోరేటర్ బొండా జగన్ అన్నారు. మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని 87 వార్డు కణితి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. మలేరియా అంతం మనతోనే.. మలేరియా నివారణలో భాగస్వామ్యం కావాలని నినాదాలు చేస్తూ వడ్లపూడి నుంచి ఈ-సేవా సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కణితి పీహెచ్‌సీ వైద్యులు శివయ్య మాట్లాడుతూ అవగాహనతో మెలగితే మలేరియా నివారణ సాధ్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు బాబీ, గోపి, శానిటరీ ఎస్సై అప్పారావు, టీడీపీ నేతలు వర్రె రాంబాబు, ప్రగడ దానయ్య, రాజన్‌రాజు, మాటూరి రాము,పోతల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ములగాడ హౌసింగ్ కాలనీలో...

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా మలేరియా విభాగం హెల్త్ టెక్నికల్ సూపర్‌వైజర్ భవానీ, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచడం వల్ల వ్యాధులు దరి చేరవని తెలిపారు. వారానికి రెండుసార్లు ఇళ్లల్లో డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ హైస్కూల్ ప్రిన్సిపాల్ తోనంగి వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సునీల్, ఉరుకూటి సతీశ్, మలేరియా విభాగం సూపర్‌వైజర్ డి. శ్రీనివాసరావు, మల్కాపురం ఏరియా సిబ్బంది పాల్గొన్నారు.


డిప్యూటీ సీఎం పవన్ తిరుగు ప్రయాణం

గోపాలపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన నగరవాసి జేఎస్ చంద్రమౌళి కుటుంబాన్ని పరామర్శించడానికి గురువారం రాత్రి నగరానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరిగి ప్రయాణమయ్యారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆయన ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం బయలుదేరి వెళ్లారు.

వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌పై కేసు నమోదు

మల్కాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహన్ నాయుడుపై మల్కాపురం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ రామ్‌సింగ్, రామ్మోహన్‌నాయుడు వద్ద పని నిమిత్తం క్రేన్‌లు, లారీలు తీసుకున్నారు. వాటికి సంబంధించి రామ్మోహన్‌నాయుడుకు రామ్ సింగ్ కొన్ని లక్షల రూపాయలు బకాయి ఉన్నాడు.ఈవిషయమై గురువారం రాత్రి రామ్‌సింగ్‌ను రామ్మోహన్‌నాయుడు అడగ్గా ఇద్దరి మధ్య వాగ్వావాదం జరిగింది. దీంతో రామ్మోహన్‌నాయుడు అతనిపై చేయి చేసుకోవడంతో నుదిటపై స్వల్ప గాయమైంది. రామ్‌సింగ్ ఫిర్యాదు మేరకు మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

మరిడిమాంబ జాతర రేపు



పెందుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి జాతర ఆదివారం జరగనుంది. ఈమేరకు ఆలయ కమిటీ భారీగా ఏర్పాట్లు చేస్తోంది. నాలుగు రోడ్ల కూడలికి ఇరువైపులా ఆరు స్టేజ్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పలు సెట్టింగ్‌లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం నుంచి కూడలి వరకు లైటింగ్ అమర్చుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

'అంబేడ్కర్ విగ్రహాన్ని యథా స్థానంలో ఉంచాలి'



పోలీసులతో ప్రజా సంఘాల నాయకుల వాగ్వావాదం

పెందుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చినముషిడివాడలోని ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో వున్న అంబేడ్కర్ విగ్రహాన్ని రెవెన్యూ సిబ్బంది మళ్లీ యథా స్థానంలోనే ఉంచాలని డిమాండ్ చేస్తూ పీఓడబ్ల్యూ ప్రజా సంఘాలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు తహసీ ల్దార్ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో వివాదం తలెత్తింది. పీఓడబ్ల్యూ ప్రతినిధులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన చేస్తే అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. మూకుమ్మడిగా కాకుండా ఇద్దరు మాత్రమే లోపలికి వెళ్లి వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతి స్తామని పోలీసులు చెప్పారు. అనంతరం పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి ఎం. లక్ష్మి, తదితరులు తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

వేసవిలో తగు జాగ్రత్తలతో మెరుగైన ఆరోగ్యం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తగు జాగ్రత్తలతోనే ఆరోగ్యంగా ఉంటారని స్టీల్‌ప్లాంట్ జ్యోతి బాలవిహార్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇంద్రాణి అన్నారు. స్కూలులో శుక్రవారం వేసవి వినోదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి చిన్నారులు అవకాశాలుగా మార్చుకోవాలన్నారు. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, వారితో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

మల్కాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న పరిణామాలు, పోర్టు ట్రస్ట్ ఆస్పత్రి ప్రైవేటీకరణ, కార్మికుల ఇబ్బందులను జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం జాతీయ ఇంటక్ అధ్యక్షుడు సంజీవరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం ఆయన సంజీవరెడ్డిని హైదరాబాద్‌లో కలిసి కార్మిక సమస్యలను వివరించారు. ప్లాంట్ ఉద్యోగులకు కొద్ది నెలలుగా సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, ఇటీవల కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని చెప్పారు. ఈ సమస్యలపై కేంద్రంతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం

సింహాచలం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి పదిహేడు రోజుల పాటు నిలిచిపోయిన ఆర్జిత సేవలు శుక్రవారం పునఃప్రారంభమయ్యాయి. వార్షిక తిరుకల్యాణోత్సవాల అంకురార్పణతో ఈనెల 7 నుంచి ఈ సేవలను నిలిపివేశారు. కల్యాణోత్సవం శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి సహస్రనామ తులసీ దళార్చన, గరుడ సేవలు జరిపారు. ఉదయం 9.30గంటలకు నిత్య కల్యాణాన్ని నిర్వహించారు.

ఎండలతో అప్రమత్తం!



» వడదెబ్బకు గురయ్యే ప్రమాదం » నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం

» రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
» చిన్నారులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి
» ముందస్తు చర్యలతో ఉపశమనం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): **వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. పగటి పూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండే ఎండలతో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మేలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.**

అధిక ఎండల ప్రభావంతో వడదెబ్బ తగిలే అవకాశాలుంటాయి. ముఖ్యంగా శరీరంలో తగినంత నీటి పరిమాణం లేకుంటే వెంటనే సొమ్మసిల్లి పడిపోతారు. ముఖ్యంగా వడదెబ్బ తగిలినప్పుడు శరీరంలోని ద్రవాలు, రక్త పరిమాణం స్థాయి పడిపోవడంతో మెదడు, గుండెకు రక్త ప్రసరణ జరగక మరణాలు సంభవిస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందంటున్నారు.

లక్షణాలివి...

శరీరంలోని నీరు, లవణాలు (ఎలక్ట్రోలైట్స్, సోడియం, పొటాషియం క్లోరైడ్) సమతుల్యత దెబ్బతిని, చెమట రూపంలో బయటకు వెళ్లిపోవడం వల్ల మనిషి తీవ్ర అస్వస్థతకు గురై వడదెబ్బ బారిన పడతాడు. దీంతో ప్రాణహాని కలిగే అవకాశం ఉంది. దీనిని వడదెబ్బ (సన్ స్ట్రోక్) అంటారు. వీటితో పాటు ఎగశ్వాస, ఎడతెరిపిలేని దాహం, కళ్లు తిరగడం, తూలిపోవడం, పరాకు మాటలు, శరీరమంతా చెమటలు పట్టడం, నాడి వేగం తగ్గిపోవడం, శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీల కంటే ఎక్కువ ఉండడం, తీవ్రమైన తలనొప్పి, నీరసం, చర్మం పొడిబారి పోవడం, మూత్రం పసుపు రంగులోకి మారి మంటరావడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా విపరీతమైన నీరసం ఆవహించి, అపస్మారక స్థితిలోకి వెళ్లి పోతారు.

నివారణ చర్యలివీ..

వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయంలో బయటకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండాలి. ఉదయం పూటే పనులన్నీ పూర్తి చేసుకోవాలి. తప్పనిసరి పరిస్థితిలో బయటకు వెళ్లాల్సి వస్తే తలపై టోపీ లేదా గొడుగు ఉపయోగించాలి. దాహం వేసేంత వరకూ ఆగకుండా నీరు, ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. చెమటను పీల్చుకొని, వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలి. కళ్లకు రక్షణ కోసం చలువ కళ్లద్దాలు ధరించాలి. తక్కువ మోతాదులో ఎక్కువసార్లు మంచి నీరు, జ్యూస్‌లు తీసుకోవడం శ్రేయస్కరం. ఎండా కాలం వీలున్నంత వరకూ మాంసాహారానికి దూరంగా ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తాటి ముంజలు, కొబ్బరిబొండాలు, నీళ్లు, ఐస్ లేకుండా చెరకు రసం, పండ్ల రసాలు, గంజి, మజ్జిగ, బార్లీ తీసుకోవాలి. వడదెబ్బ బారిన పడితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరచుగా తీసుకోవాలి.







చికిత్సా విధానం...

వడదెబ్బ బారిన పడిన వ్యక్తిని చల్లని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలి. తడిగుడ్డతో పలుమార్లు శరీరాన్ని తుడవాలి. ఎక్కువగా ద్రవ పదార్థాలు ఇవ్వాలి. గ్లాసు నీళ్లలో రెండు స్పూన్ల పంచదార, చిటికెడు ఉప్పు, నిమ్మ రసం వేసి తాగించాలి. ఒకవేళ అపస్మారక స్థితిలోకి వెలితే శరీరం పైఉన్న వస్త్రాలు తొలగించి, చల్లని గాలి తగిలే నీడ ఉన్న చోట కూర్చోబెట్టాలి. స్పృహలోకి వచ్చాక ద్రవ పదార్థాలు ఇవ్వాలి. ఏసీ ఉన్న గదిలో ఉంచితే మరీ మంచిది. అప్పటికీ బాధితుడు కోలుకోలేకపోతే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి. అక్కడ ఐవీ ఫ్లూయిడ్స్ ఇచ్చి వైద్యుల సంరక్షణలో బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేయించాలి. సాధారణ స్థితిలోకి వచ్చే వరకే ఫ్లూయిడ్స్ ఎక్కించాల్సి ఉంటుంది. బాధితుని బీపీ, పల్స్ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.

అప్రమత్తత అవసరం



పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఉదయం పూటే బయట పనులన్నీ చక్కబెట్టుకోవాలి. అవసరం లేకుండా ఎండలో తిరగకూడదు. వడదెబ్బపై సరైన అవగాహన లేకపోవడం వలన అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయే ప్రమాదం ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు తమ వెంట విధిగా వాటర్ బాటిల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గొడుగు తీసుకువెళ్లాలి.

- వేగి అవినాష్, ఎండీ జనరల్ మెడిసిన్

ఆచార్య చలంకు అవార్డు


కేఎస్ చలం

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య కేఎస్ చలం తమిళనాడు వీసీకే అంబేడ్కర్ అవార్డుకు ఎంపిక కయ్యారు. ప్రతి ఏటా అంబేడ్కర్, పెరియార్ పేరు మీదుగా వీసీకే సంస్థ అవార్డులు అందిస్తుంది. చలం ఏయూ నుంచి జాతీయస్థాయి రాజ్యాంగ పదవి పొందిన మొదటి ఆచార్యులు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా ఉన్నత పదవి పొందారు.

దివ్యాంగులకు ప్రభుత్వం తోడ్పాటు: మంత్రి డోలా


ఉపకరణాలు పంపిణీ చేస్తున్న మంత్రి డోలా

మహారాణిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీసి ఆత్మవిశ్వాసంతో సాగేలా ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఐడీబీఐ సామాజిక బాధ్యత కార్యక్రమం కింద ఆలింకో సంస్థ తయారు చేసిన రూ.49 లక్షల విలువైన అత్యాధునిక ఉపకరణాలను 241 మంది దివ్యాంగులకు అందజేశారు. దివ్యాంగుల శారీరక, మానసిక దృఢత్వం కోసం రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో అత్యాధునిక పారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. రీజనల్ సెంటర్ ఏర్పాటుకు స్థలం కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, ఐడీబీఐ ప్రతినిధులు కన్వాడెబ్ దాస్, ఏడీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణదారులను ఇబ్బంది పెడితే చర్యలు

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ఎవరైనా ఇంటి నిర్మాణం చేపడితే శాఖలతో సంబంధం లేకుండా పలువురు యజమానులను వేధిస్తున్నారని, విలేకరుల పేరుతో ఫొటోలు తీసి బెదిరిస్తున్నారని జిల్లా సమీక్షా సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామి కలెక్టర్, సీపీలకు సూచనలిచ్చారు. గృహ నిర్మాణం విషయంలో తమను ఇబ్బంది పెడుతున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్వీకరించాలని, పరిశీలించి తప్పు లేకుండా బెదిరించినట్టు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వంద గజాలలోపు ఇల్లు నిర్మించుకునేవారికి ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని స్పష్టం చేశారు.

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కృషి

» విలు విద్య పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి సంధ్యారాణి


విలువిద్య పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఎండాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 27.39 లక్షల గిరిజనుల (ఎస్టీ) సమగ్ర సామాజిక ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో 34 షెడ్యూల్ తెగలు, ప్రత్యేకంగా 11 బాధపడే తెగలున్నారని, వారి అభివృద్ధి కోసం అనేక పథకాలతో ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని మహిళా శిశు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనజాతీయ ఖేల్ మహోత్సంలో భాగంగా ట్రైబల్ ఆర్చరీ (విలువిద్య) మీట్‌ని జీమ్‌సర్‌లోని ఆడిటోరియంలో మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్చరీ పోటీల్లో పలు రాష్ట్రాల గిరిజన విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా రాష్ట్ర, జాతీయ గిరిజన కళా ప్రదర్శనలు, నృత్యోత్సవాలు, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, గిరిజన పండగలను విశాఖ, విజయవాడ నగరాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా పక్కా ఇళ్ల నిర్మాణం, రోడ్లను లింక్ చేయడం, పైపుల ద్వారా తాగునీటి సరఫరా, మొబైల్ మెడికల్ కిట్లు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం సోలార్ గ్రిడ్ వ్యవస్థ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ, టీసీఆర్ అండ్ టీఎం అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):విశాఖ-చర్లపల్లి, సంబల్‌పూర్-ఈరోడ్-సంబల్‌పూర్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొద్ది రోజులు పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.విశాఖ-చర్లపల్లి-విశాఖ (08579) రైలు శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖలో బయలుదేరింది. మళ్లీ మే 2, 9, 16, 23, 30న బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 26, మే 10, 17, 24, 31న రాత్రి 7 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గ టలకు విశాఖ చేరుతుంది. సంబల్‌పూర్-ఈరోడ్ (08311) రైలు మే 7, 25న ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.30 గంటలకు ఈరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో మే 9, 27న మధ్యాహ్నం 2.45కు ఈరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.08కు దువ్వాడ, శనివారం రాత్రి 11.15కు సంబల్‌పూర్ చేరుతుంది.

మళ్లింపు మార్గంలో హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్

విశాఖ-అమృతసర్ మధ్య నడిచే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మే 1 నుంచి జూన్ 30 వరకు మళ్లింపు మార్గంలో నడుస్తాయి. విశాఖ-అమృతసర్ మే 2, 3, 6, 9, 10, 13, 16, 17, 20, 23, 24, 27, 30, 31, జూన్ 3, 6, 7, 10, 13, 14, 17, 20, 21, 24, 27, 28 తేదీల్లో సర్లా జంక్షన్ రైల్వేస్టేషన్, సంబల్‌పూర్ సిటీ మీదుగా , అమృత్‌సర్-విశాఖ హిరాకుడ్ మే 3, 4, 7, 10, 11, 14, 17, 18, 21, 24, 25, 28, 31, జూన్ 1, 4, 7, 8, 11, 14, 15, 18, 21, 22, 25, 28, 29 తేదీల్లో సర్లా జంక్షన్, సంబల్‌పూర్ సిటీ మీదుగా నడుస్తాయన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి జిల్లా జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-9 బాలుర, బాలికల ఓపెన్ చెస్ టోర్నీ కమ్ జిల్లా జట్టు ఎంపికలు శుక్రవారం ముగిశాయి.గాయత్రి విద్యామందిర్‌లో జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో లక్షిత్ గుత్తి, భవదీప్ గెద్దాడ, బాలికల కేటగిరీలో లాశ్రిత సిరిసిపిల్లి, ఆశ్రిత దుబే ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వచ్చే నెల 3 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్ర స్థా యి టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తార నిచెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు.

జిల్లాలో 4,534 మందికి మత్స్యకార భరోసా


సమావేశంలో మాట్లాడుతున్న బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణరావు

మహారాణిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం మత్స్యకారులకు రూ.20 వేల చొప్పున ఖాతాల్లో జమ చేయనుందని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖైలపల్లి లక్ష్మణరావు తెలిపారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో శనివారం మత్స్యకార భరోసా నిధులు విడుదల చేస్తారన్నారు. జిల్లాలో 5,360 మంది దరఖాస్తు చేసుకోగా 4,534 మంది అర్హత పొందారన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ప్రతినిధులు పి.సి.అప్పారావు, గరికిన పరుశురామ్, తోట సత్తిరాజు, మేరుగు ధనరాజు, కోలా ఎల్లయ్య, ఖైలపల్లి రాజా తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న సాయంత్రం 4 గంటల నుంచి చంద్రంపాలెంలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి భూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనదలచినవారు జనవరి ఒకటి 2012న లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలి. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు వచ్చే నెల 15 నుంచి చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి మండలాలకు పాఠ్య పుస్తకాల పంపిణీ

గాజువాక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు శనివారం నుంచి పాఠ్య పుస్తకాలను సరఫరా చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయానికి సుమారుగా 10 లక్షల సెమ్-1 పుస్తకాలు చేరాయి. తొలి విడతగా ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాలకు వీటిని సరఫరా చేయనున్నారు. జిల్లాలోని 11 మండలాల పరిధిలో సెమ్-1కు సంబంధించి 3,71,700 పుస్తకాలు అవసరం కాగా 2,58,553 అందుబాటులో ఉన్నాయి. అనకాపల్లి జిల్లాలోని 24 మండలాల పరిధిలో 5,08,355 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా 3,54,733 అందుబాటులో ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాల పరిధిలోని పాఠశాలలకు 5,13,909 పుస్తకాలు అవస రం కాగా 3,59,739 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. మే నెలాఖరులోగా ఎంఈవో కార్యాలయాలకు శతశాతం సరఫరా చేస్తామని, అక్కడి నుంచి హెచ్ఎంలు తీసుకువెళ్తారన్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులందరికీ వీటిని అందజేయనున్నారు.


పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు

క్రైం... crime news

బైక్‌ల చోరీ కేసులో నిందితుల అరెస్టు

» 17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో పోలీసులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ వెయిటింగ్ హాల్లో విశ్రాంతి తీసుకునే వారి బ్యాగులను చోరీ చేసే ప్రబుద్ధుడు 31 కేసుల్లో నిందితుడు. అంతేకాదు 17 ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. వాహనాన్ని పార్క్ చేసి, తాళాలు మరిచిపోయే వారిని గమనించి, చోరీ చేసేవాడు. ఈ ఏడాది మార్చి 17న పెదవాల్తేరు రిలయన్స్ స్మార్ట్ వద్ద హోండా యాక్టివా పోయినట్టు దాసరి శంకరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ద్వారకా క్రైమ్ సీఐ వి.చక్రధరరావు, క్రైమ్ ఎస్ఐ ఎం.అప్పలరాజు, ఏఎస్ఐ కిశోర్‌బాబు, కానిస్టేబుళ్లు జగత్, కిరణ్, హరిప్రసాద్, సాయి, అప్పలరాజు, అగస్టీన్ దర్యాప్తు చేశారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు విజయనగరం జిల్లా బొబ్బిలి వెళ్లినట్టు గమనించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం, కోట సీతారామపురానికి చెందిన పాత నేరస్థుడు కోట శివగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా ఎంవీపీ కాలనీ, మహారాణిపేట, వన్‌టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 17 బైకులు దొంగలించినట్టు తేలింది. అతడి నుంచి 9 బైకులను స్వాధీనం చేసుకోగా, ఎనిమిది బైకులను బేతనబెల్లి వినయ్‌కుమార్ తక్కువ ధరకు కొనుగోలు చేసినట్టు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకుని 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు. మరో రెండు బైకులను కొనుగోలు చేసిన కర్రి మోహనరావు నుంచి స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్టు చేశారు. నిందితులను రిమాండుకు తరలించారు. దర్యాప్తు చేసిన సిబ్బందిని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, క్రైమ్ డీసీపీ లతా మాధురి, ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు అభినందించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం వెలికితీత


మృతదేహాన్ని వెలికితీస్తున్న స్థానికులు

పెదబయలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం తారాబు జలపాతంలో గురువారం గల్లంతైన బీటెక్ విద్యార్థి గొన్నూరి కిశోర్ (22) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్ఐ కొల్లి రమణ, ఆర్ఐ పూర్ణయ్య ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం ఉదయం నుంచి గాలింపు చేపట్టారు. జలపాతంలో రాళ్ల మధ్యన ఇరుక్కున్న మృతదేహాన్ని తాళ్ల సాయంతో వెలికితీశారు. ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

లైంగిక దాడి కేసులో ముద్దాయికి జైలు

విశాఖలీగల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లి పేరుతో లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ 11వ అదనపు జిల్లా కోర్టు కం ఎస్ఎస్‌టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలికి లోక్ అదాలత్ ద్వారా రూ.4లక్షలు పరిహారంగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. పెదజాలరిపేటకు చెందిన పిడుగు రమేష్(26) బీమా కంపెనీలో ఏజెంటు. అదే కంపెనీలో పనిచేసిన ఓ అమ్మాయిని పెళ్లిచేసుకుంటానని నమ్మించి శారీరకంగా లొంగదీసుకున్నాడు. పలుమార్లు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతేకాకుండా మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యాడు. బాధితురాలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో నలుగురి అరెస్టు

ఎండాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జోడుగుళ్లపాలెంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించిన నలుగురు నిందితులను సైబర్‌క్రైమ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ముందుగా పెదవాల్తేరుకు చెందిన నిందితుడ్ని అరెస్టు చేసి విచారించగా ముఠా గుట్టురట్టయింది. వీరంతా మధురవాడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ అద్దెకి తీసుకుని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. వీరిలో ముగ్గురు బుకీలు మధురవాడ, శివాజీపాలెం, చినగదిలికి చెందిన వారుకాగా ఒకరు ఏయూలో గ్రేడ్-2 డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వారి నుంచి ల్యాప్‌టాప్, నాలుగు స్మార్ట్‌ఫోన్‌లు, రెండు బేసిక్ ఫోన్లను సీజ్ చేశారు. ప్రధాన ముద్దాయితో పాటు బెట్టింగ్‌లో పాల్గొన్న వారిని అరెస్టు చేయాల్సి ఉంది.

చర్చిలో బాలిక మృతిపై దర్యాప్తు చేస్తున్నాం: ఏసీపీ

కంచరపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం సెయింట్‌పీటర్ చర్చి ప్రాంగణంలో గురువారం విజయనగరం జిల్లా డెంకాడ మండలానికి చెందిన ఈదల పూర్ణచంద్రిక (11) మృతిపై దర్యాప్తు చేస్తున్నామని వెస్ట్ ఏసీపీ పృథ్వితేజ్ పేర్కొన్నారు. కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పూర్ణచంద్రికకు మానసిక సమస్య ఉండడంతో తల్లి, అమ్మమ్మ జ్ఞానాపురం చర్చికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి కొత్తవలసలో కూడా ప్రార్థనలు చేసి సాయంత్రానికి మళ్లీ జ్ఞానాపురం చర్చికి వచ్చారన్నారు. చర్చిలో ఎవరూ లేకపోవడంతో బయట కూర్చొన్నారని, బాలిక గట్టిగా అరవడం, హింసాత్మకంగా ప్రవర్తించడంతో అమ్మమ్మ, తల్లి గుడ్డతో ఆమె ముఖంపై కప్పారు. అప్పటికే నీరసంగా ఉన్న బాలిక కాసేపటికే మృతిచెందింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. గొడవల కారణంగా బాలిక తల్లిదండ్రులు నాలుగేళ్లుగా విడిగా ఉంటున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఊపిరాడక మృతి చెందిందా? ఇతర కారణాలున్నాయా? అనేది దర్యాప్తులో తెలుస్తుందన్నారు.

నేడు జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి శనివారం ఉదయం 11 గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు కూటమి కార్పొరేటర్లలంతా దసపల్లా హోటల్‌లో ప్రత్యేక శిబిరంలో ఉన్నారు. శనివారం ఉదయం 10.30కు జీవీఎంసీ కార్యాలయానికి వస్తారు. మరోవైపు.. వైసీపీ కార్పొరేటర్లు అవిశ్వాసాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. అవిశ్వాసం నెగ్గాలంటే 74 మంది కార్పొరేటర్లు అవసరం. మేయర్‌పై అవిశ్వాసం నెగ్గిన నేపథ్యంలో శనివారం కొందరు వైసీపీ కార్పొరేటర్లు సమావేశానికి హాజరై కూటమికి మద్దతు పలికే అవకాశముందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సమావేశానికి పోలీసులు భద్రతా చర్యలు చేపడుతున్నారు.

ఈ ఏడాది జూ ఆదాయం రూ.7.25 కోట్లు

ఆరిలోవ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు 2024- 25 సంవత్సరానికి గాను సుమారు రూ. 7,25,84,000 ఆదాయం సమకూరిందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. గత ఏడాది (2023-24)లో రూ.7,16,80,000 ఆదాయం వచ్చిందన్నారు.

రెండు రోజుల్లో 80 కిలోల చందనం అరగదీత

సింహాచలం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 30న చందనోత్సవం నాటి రాత్రి సమర్పించనున్న తొలివిడత చందనం కోసం ఆలయ సిబ్బంది రెండు రోజులు శ్రమించి 80కిలోల చందనాన్ని సిద్ధం చేశారు. చైత్రమాస బహుళ పక్ష ఏకాదశి ఈనెల 24న ప్రధానార్చకులు అరగదీతకు శ్రీకారం చుట్టారు. అనంతరం 13 సానలు (శిలలు)పై సిబ్బంది నోటికి గుడ్డలు కట్టుకుని గురువారం 32కిలోలు, శుక్రవారం 48కిలోలు చందనాన్ని అరగదీశారు. ఆలయ స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్, ఏఈఓ ఆనందకుమార్‌లు తూనిక వేసి పద్మనిధిలో భద్రపరిచారు.